PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 261 | విజయవాడ, సోమవారం 24 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 24 April 2023 | Rs

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 104 సేవలు

- రాష్ట్ర మహాసభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్
- సమస్యలపై ఐక్య పోరాటాలకు పిలుపు

లోపలి పేజీలో..



ఉత్కంఠపోరులో రాజస్థాన్‌పై బెంగళూరు ఘన విజయం

లోపలి పేజీలో..



దిబ్రూగఢ్ జైలుకు అమృత్‌పాల్‌ను తీసుకొస్తున్న పోలీసులు

అమృత్‌పాల్ సింగ్ అరెస్టు

- దిబ్రూగఢ్ జైలుకు తరలింపు
- అరెస్టు చేశారా? లొంగిపోయాడా?

చండీగఢ్ : పోలీసులకు చిక్కకుండా నెల రోజులుగా తప్పించుకు తిరుగుతున్న ఖలిస్తాన్ వేర్పాటువాది, వారిస్ పంజాబ్ దే (డబ్ల్యూపిడి) చీఫ్ అమృత్‌పాల్ సింగ్ ఎట్టకేలకు పట్టుబడ్డాడు. ఖలిస్తాన్ ఉగ్రవాది బింద్రన్‌వాలే స్వగ్రామమైన మోగా జిల్లాలోని రోడే గ్రామంలో ఆదివారం ఉదయం 6:45 గంటలకు అతడ్ని అరెస్టు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.. ఆ వెంటనే అస్సాంలో దిబ్రూగఢ్ సెంట్రల్ జైలుకు ప్రత్యేక విమానంలో అతడ్ని తరలించారు.. జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ)లోని వివిధ సెక్షన్ల కింద అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజిపి) సుక్‌చైన్ సింగ్ గిల్ చండీగఢ్‌లో మీడియాకు వెల్లడించారు. అయితే అమృతపాల్ అరెస్టు కాలేదని, ఆతడే స్వయంగా లొంగిపోయాడనే వాదనలు కూడా వినిపించాయి. పోలీసులు అమృతపాల్‌ను అరెస్టు చేశామని చెబుతుండగా, అమృతపాల్ అనుచరులు మాత్రం అతడే లొంగిపోయాడని అంటున్నారు. రోడే గ్రామంలో గురుద్వారా వద్ద అమృతపాల్ తన అనుచరులనుద్దేశించి మాట్లాడుతూ, తాను లొంగిపోతున్నానని ఆయన స్పష్టంగా చెప్పినట్లు ఓ వీడియోలో ఉంది. అది ఇప్పుడు ఒసోష్లల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీనిని బట్టి ఆయనది అరెస్టు కాదు, సరెండర్ అని అమృతపాల్ అనుయాయుల వాదన. పోలీసుల కథనం వేరేలా ఉంది. అమృత్‌పాల్‌ను పట్టుకోవడానికి పంజాబ్ పోలీస్ ఇంటెలిజెన్స్ విభాగం నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్ ఫలించిందని పోలీస్ ఉన్నతాధికారి గిల్ తెలిపారు. రోడే గ్రామంలో అమృత్‌పాల్ ఉన్నట్లు సమాచారం అందగానే పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టుముట్టారన, ఆ గ్రామంలోని ఓ గురుద్వారాలో అమృతపాల్ దాక్కున్నాడని తెలియడంతో గురుద్వారా పవిత్రతకు భంగం కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పోలీసులు గురుద్వారాలోకి వెళ్లకుండానే, అన్ని మార్గాలు మూసివేసి అతడిని బయటకు రప్పించేలా చేశారని గిల్ తెలిపారు. . అమృతపాల్‌ను తీసుకుని భటిండా నుంచి బయల్దేరిన ప్రత్యే విమానం ఆదివారం మధ్యాహ్నం 2:20 గంటలకు దిబ్రూగఢ్ విమానాశ్రయంలో దిగింది. అవసరమైన లాంఛనాలన్నీ పూర్తి చేసి అతడిని సెంట్రల్ జైలుకు తరలించారు. సెంట్రల్ జైలు వద్ద పలు అంచెల భద్రతా వలయాలను ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అరెస్టయిన అమృత్‌పాల్ సింగ్ అనుచరులు తొమ్మిది మంది దల్జిత్ సింగ్ కల్సి, పాపల్‌ప్రీత్ సింగ్, కుల్వంత్ సింగ్ ధాలివాల్, వరిందర్ సింగ్ జోహల్, గుర్మీత్ సింగ్ బుక్కన్‌వాలా, హర్జిత్ సింగ్, భగవంత్ సింగ్, బసంత్ సింగ్, గురిందర్‌పాల్ సింగ్ ఔజ్లా ఇదే జైలులో ఉన్నారు.

బిజెపితో దేశానికి ప్రమాదం

విధానపరమైన ప్రత్యామ్నాయంతో మోడీ ప్రభుత్వాన్ని ఓడిద్దాం

ప్రచార భేరి సభలో సిపిఎం, సిపిఐ నేతలు బివి రాఘవులు, కె రామకృష్ణ

ప్రజాశక్తి- గన్నవరం

బిజెపిని ఓడించకపోతే దేశం మరింత ప్రమాదంలో పడిపోతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. బిజెపిని నమ్మితే రాజకీయ పార్టీలకే కాకుండా ప్రజలకూ బతుకు లేకుండా చేస్తుందన్నారు. 'బిజెపిని సాగనంపుదాం... దేశాన్ని కాపాడుకుందాం' పేరుతో వామపక్షాల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా గన్నవరంలో ఆదివారం జరిగిన ప్రచార భేరీ బహిరంగ సభలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సమాఖ్య వ్యవస్థను నాశనం చేసేందుకు, కేంద్రీకృత పాలనను రుద్దడానికి చేస్తోన్న ప్రయత్నాలను అడ్డుకోవడానికి అన్ని పార్టీలూ ఐక్యంగా నడవాలని రాఘవులు కోరారు. దేశంలో ఎన్నికైన బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా, ఫెడరలిజంపై అది సాగిస్తోన్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్, హిందూత్వ బిజెపికి విధానపరమైన ప్రత్యామ్నాయంతో ప్రతిపక్షాలన్నీ ఏకమైతే మోడీ ప్రభుత్వాన్ని సాగనంపవచ్చని అన్నారు. అధికారం కోసం బిజెపిని నమ్మిన ఏ రాజకీయ పార్టీ అయినా నిలువునా మునిగిపోవడం ఖాయమని తెలిపారు. అధికారంలోకి రాగానే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోడీ ఆ హామీని నిలబెట్టుకోకపోగా ఉన్న ఉద్యోగాలను తీసేస్తున్నారన్నారు. కొత్తగా ఒక పరిశ్రమనూ ఏర్పాటు చేయకపోగా ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్లకు అమ్మేస్తున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్లను, విమానాశ్రయాలను ప్రయివేట్ వారికి కట్టబెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం గన్నవరం విమానాశ్రయాన్ని ప్రయివేట్ వారికి కట్టబెట్టాలని చూస్తోందని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటుపరం చేసేందుకు కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం రైల్వే స్టేషన్లను సుందరంగా తయారు చేసి కార్పొరేట్లకు అప్పగించే పనిలో కేంద్రం ఉందని దుయ్యబట్టారు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు పోరాడి విజయం సాధించారని, ఇదే స్ఫూర్తితో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మోదీ అధికారానికి వచ్చినప్పుడు ఆదాని ఆస్తి రూ.70 వేల కోట్లుగా ఉండేదన్నారు. గడిచిన ఏడేళ్లలో ఇది రూ.16 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. దీన్నిబట్టి మోడీ ఎవరి ప్రయోజనాల కోసం పని చేస్తున్నారో అర్థమవుతోందన్నారు. బిజెపిని విమర్శించే వారిపై కేంద్ర ప్రభుత్వం ఇడిని, సిబిఐని ఉసిగొల్పుతోందని దుయ్యబట్టారు. తుపాకులతో బెదిరించే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తోన్నా ఇక్కడి అధికార పక్షం, ప్రధాన ప్రతిపక్షం ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. మోదీ చెప్పుల్లో కాళ్లు పెట్టి జగన్ నడుస్తున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు పరిస్థితి కూడా ఇలాగే ఉందన్నారు. రాష్ట్ర రాజధాని నిర్మాణానికి నిధుల కోసం, విశాఖ ఉక్కుని కాపాడుకోవడానికి, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి సాధించకపోతే తగిన మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. దేశ ప్రయోజనాలను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించే పార్టీలకు వామపక్షాలు అండగా నిలుస్తాయన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ మోడీకి కార్పొరేట్ శక్తుల సంక్షేమం తప్ప, పేదల, కార్మికుల సంక్షేమం పట్టడం లేదని విమర్శించారు. మోడీ పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క మౌలిక సంస్థ అయినా రాలేదన్నారు. అయినా, మోడీకి జగన్ ఊడిగం చేస్తున్నారని దుయ్యబట్టారు. నిత్యావసరాల వస్తువులు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బిజెపిని ఓడించేందుకు వామపక్షాలు ముందుండి పోరాడుతున్నాయన్నారు. తొలుత గన్నవరంలో వామపక్షాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. ఈ సభకు వామపక్షాల జిల్లా నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, అడ్డాడ ప్రసాద్ అధ్యక్షత వహించారు.



గన్నవరంలో బహిరంగ సభలో మాట్లాడుతున్న బివి రాఘవులు, వేదికపై కె రామకృష్ణ తదితరులు, సభకు హాజరైన జనం

అకాల వర్షం... తీవ్ర నష్టం

- పిడుగుపాటుకు ఐదుగురు మృతి
- తడిచిపోయిన వరి, మొక్కజొన్న
- దెబ్బతిన్న మిర్చి, బత్తాయి, బొప్పాయి పంటలు



వెంకట్రామయ్య(ఫైల్)





కృపానందం, చాట్ల శ్యామ్‌బాబు మృతదేహాలు



పల్నాడు జిల్లా ఈపూరు మండలం ఇనిమెళ్లలో దెబ్బతిన్న ఖర్బూజ పంట

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో పలుచోట్ల ఈదురు గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ఆదివారం కురిశాయి. గత కొన్ని రోజులుగా వేడి గాలులతో అల్లాతున్న ప్రజానీనాకి ఈ అకాల వర్షాలతో ఒక్కసారిగా ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం ఊరటనిచ్చినప్పటికీ ప్రాణ నష్టం, పంట నష్టం కూడా సంభవించింది. ఈదురు గాలులు, వర్షాలకు వరి, మొక్కజొన్న, మిర్చి, బత్తాయి, బొప్పాయి తదితర పంటలు దెబ్బతిన్నాయి. కడపటి సమాచారం మేరకు పిడుగులు పడి కృష్ణా జిల్లాలో ముగ్గురు, గుంటూరు జిల్లాలో ఇద్దరు చనిపోయారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో పిడుగుపాటుకు చాట్ల శ్యామ్‌బాబు (47), కొరివి కృపాదానం (52) మృతి చెందారు. తమ కళ్లాల్లో ఉంచిన మిర్చిపై పట్టాలు కప్పుతున్న ఈ సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వర్షాలు, ఈదురు గాలులకు పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి, భద్రుపాలెం, ఇనిమెళ్ల గ్రామాల్లో పండ్ల తోటలు దెబ్బతిన్నాయి. పుచ్చ, ఖర్బూజ కాయలు పగిలిపోయాయి. బత్తాయి, బొప్పాయి, తోటలలో కొమ్మలు విరగడంతోపాటు కాయలు నేలరాలాయి. మిర్చి పంటకూ నష్టం వాటిల్లింది. రొంపిచర్ల మండలంలో చెట్లు నేలకొరిగి తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ఇళ్ల రేకులు ఊడి పడ్డారు. పిడుగురాళ్లలోని మార్కెట్ యార్డుల్లో ఉంచిన ధాన్యం తడిసిపోయింది. చివరి కోత దశలో ఉన్న మిర్చి పంటకు నష్టం వాటిల్లింది. గుంటూరు దుగ్గిరాల మండలంలో మొక్కజొన్న పంట దెబ్బతింది. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో ఓ షెడ్డు దెబ్బతిన్ని రూ.10 లక్షల వరకూ నష్టం వాటిల్లింది. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురంలో పిడుగుపాటుకు అదే గ్రామానికి చెందిన మత్తి వెంకట్రామయ్య అలియాస్ చిన్నా (53) మృతి చెందారు. కళ్లంలో ఉంచిన మొక్కజొన్నపై పరదాలు కప్పుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. పిడుగుపాటుకు చల్లపల్లి మండలం రామాపురం క్లబ్ రోడ్డు ప్రాంతానికి మిగతా 2లో

దూకుడు పెంచిన సిబిఐ

- వివేకా, అవినాష్‌రెడ్డి గృహాల పరిశీలన, సీన్ రీ కన్‌స్ట్రక్షన్
- వివేకా కంప్యూటర్ ఆపరేటర్‌ను, ఎంపి వ్యక్తిగత కార్యదర్శిని విచారించిన అధికారులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సిబిఐ దూకుడు పెంచింది. వైఎస్ వివేకా కుమార్తె సునీత ఇటీవల సుప్రీంకోర్టులో వేసిన ఫిటిషన్ సోమవారం విచారణకు రానున్న నేపథ్యంలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్‌లో భాగంగా వివేకా, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి గృహాలను సిబిఐ అధికారులు మరోమారు పరిశీలించారు. వీరి గృహాల మధ్య దూరాన్ని లెక్కించారు. వివేకా హత్య జరిగిన ఇంట్లోని బాత్రూమ్, బెడ్ రూమ్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం అవినాష్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. ఆయన ఇంటి పరిసరాలను పరిశీలించారు. హత్య జరిగిన రోజున భౌతికకాయాన్ని ఫొటోలు, వీడియోలు తీసి వివేకా కుటుంబ సభ్యులకు పంపిన వివేకా కంప్యూటర్ ఆపరేటర్ ఇనయాతుల్లాను కారులో తీసుకొని వెళ్తూ విచారణ చేశారు. అనంతరం అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రమణారెడ్డిని రింగ్ రోడ్డు సమీపంలోని శ్రీకృష్ణ దేవాలయం దగ్గరకు తీసు కెళ్లి విచారించింది. వివేకా హత్యకు ముందు, తర్వాత హంతకులు తిరిగిన ప్రదేశాలను పరిశీలించారు. విచారణలో అవినాష్ రెడ్డి చెప్పిన సమాచారాన్ని క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలించారు. ఎంత సమయంలో వివేకా ఇంటికి అవినాష్‌రెడ్డి వచ్చారనే దానిపై సిఐబి ఆరా తీసింది. సిబిఐ విచారణ పట్ల అవినాష్‌రెడ్డి అనుసరించిన సాగదీత పద్ధతులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై వాదప్రతివాదలను విన్న సుప్రీంకోర్టు సోమవారం స్పందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వివేకా హత్య ఎలా జరిగిందో సుప్రీంకోర్టుకు తెలపడానికి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ ప్రక్రియను సిబిఐ చేపట్టినట్లు సమాచారం. ఇటీవల వైఎస్ అవినాష్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో వివేకా కుమార్తె సునీత భర్త రాజశేఖర్‌రెడ్డిపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం రాజశేఖర్‌రెడ్డిని సిబిఐ విచారించింది.



వివేకా ఇంటి వద్ద సిబిఐ అధికారులు

టిటిడి కాంట్రాక్టు కార్మికుల మెరుపు సమ్మె

- రెండు వేల మంది విధులకు గైర్హాజరై నిరసన
- టైం స్కేలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్

లోపలి పేజీలో..

నిర్బంధించి యువతిపై అత్యాచారం

- ప్రతిఘటించడంతో వేడి నూనె పోసిన యువకుడు

లోపలి పేజీలో..

గొప్ప మానవతావాది రామనాథం

- సంస్మరణ సభలో పలువురు వక్తలు

లైంగిక వేధింపులపై

మళ్లీ రెజ్లర్ల ఆందోళన

- దర్యాప్తులో జాప్యంపై ఆగ్రహం
- బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ అరెస్ట్‌కు డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద ధర్నా



ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మీడియాతో మాట్లాడుతున్న రెజర్లు బజరంగ్ పూనియా, వినేష్ పొగట్, సాక్షి మాలిక్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద ఆదివారం మరోసారి ఆందోళనకు దిగారు. ఈ ఏడాది జనవరిలో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) చీఫ్ బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. అప్పుడు కొన్ని హామీలు ఇవ్వడంతో పాటు, మేరీ కోమ్ నేతృత్వంలో కమిటీ వేశారు. కానీ హామీలు అమలు చేయలేదు. కమిటీ రిపోర్టు వివరాలు వెల్లడించలేదు. దీంతో రెజ్లర్లు మళ్లీ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బ్రిజ్ భూషణ్ సింగ్‌కు వ్యతిరేకంగా రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షి మాలిక్ మీడియాతో మాట్లాడుతూ తీవ్ర విమర్శలు చేశారు. డబ్ల్యూఎఫ్ఐ చీఫ్‌పై రెజ్లర్లు చట్టపరమైన చర్యలను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. 'మేం కమిటీపై నమ్మకం కోల్పోయాం' అన్నారు. 'ప్రభుత్వం నుంచి మాకు కొన్ని హామీలు వచ్చాయి. కానీ అవి నెరవేరలేదు. కమిటీ దాఖలు చేసిన నివేదిక ఏ స్థాయిలో ఉందో మాకు తెలియదు' అని వాపోయారు. 'లైంగిక వేధింపులకు సంబంధించి బ్రిజ్‌భూషణ్ సింగ్‌పై మైనర్‌తో సహా ఏడుగురు బాలికలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానీ ఇంకా నమోదు కాలేదు. పోస్కో కేసు నమోదు చేయాలి. మేము రెండున్నర నెలలుగా మిగతా 2లో

రోడ్డు ప్రమాదంలో నలుగురి మృతి

- 22 మందికి గాయాలు

పుణె : పుణె-బెంగళూరు హైవేలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మరణించగా, 22 మంది తీవ్రగాయాల పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం కొల్హాపూర్ నుంచి ముంబై వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సును హైవేలోని స్వామి నారాయణ గుడి సమీపంలో పంచదార బస్తాలతో వెళ్తున్న ట్రక్కు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. ట్రక్కు బ్రేకులు ఫెయిల్యూర్ అవడం వల్లే ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకున్నారు. బస్సు అద్దాలను పగలగొట్టి లోపల ఉన్న వారిని రక్షించి, ఆసుపత్రులకు అంబులెన్సులలో తరలించినట్లు అగ్నిమాపక సిబ్బంది చెప్పారు.

ఇజ్రాయిల్‌లో మళ్లీ నిరసనల హోరు



ఇజ్రాయిల్ న్యాయవ్యవస్థను బలహీనపరిచే యత్నాలకు వ్యతిరేకంగా జెరూసలెంలో ఆదివారం జరిగిన భారీ నిరసన ర్యాలీ

అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు

- ఎంఐఎం చేతిలో కారు స్టీరింగ్
- విజయ సంకల్ప సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో బిజెపి అధికారంలోకి వస్తే ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని, వాటిని ఎస్సి, ఎస్టి, బిసిలకు కేటాయిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. బిజెపి పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా రంగారెడ్డి జిల్లా చేవెళ్లలోని కెవిఆర్ గ్రౌండ్‌లో విజయ సంకల్ప సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అమిత్ షా హాజరై మాట్లాడారు. ఒవైసీ అజెండాపై సిఎం కెసిఆర్ పనిచేస్తున్నారని తెలిపారు. కారు స్టీరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని విమర్శించారు. మజ్లిస్ అంటే తమకు భయం లేదని చెప్పారు. కాంగ్రెస్‌తో కలిసేందుకు బిఆర్ఎస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి సర్కార్ నడుస్తోందని ఆరోపించారు. కెసిఆర్ సర్కార్ పనితీరును దేశం మొత్తం చూస్తోందన్నారు. పేపర్ లీకేజీపై ప్రశ్నిస్తే రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్‌ను అరెస్ట్ చేశారని తెలిపారు. పేపర్ లీకేజీపై ఇంతవరకు కెసిఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పేపర్ లీక్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని కావాలని సిఎం కెసిఆర్ కలలు కంటున్నారు.. ఢిల్లీలో ప్రధాని కుర్చీ ఖాళీగా లేదని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో కేంద్ర పథకాలు ప్రజలకు చేరడం లేదన్నారు.

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడుతూ..బిజెపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిరుపేదలకు ఇళ్లు ఇస్తామని తెలిపారు. పదో తరగతి పేపర్ లీకేజీ కేసులో తనను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ తరణ్‌చుగ్, ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి, మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జ్ మురళీధర్ రావు, ఎంపి లక్ష్మణ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ మంత్రులు చంద్రశేఖర్, డికె అరుణ, మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాధ్యతా రాహిత్యంతోనే చందన యాత్రికులకు ఇబ్బందులు : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో యాత్రికుల ఇబ్బందులు తనకు బాధ కలిగించాయని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రభుత్వ బాధ్యతా రాహిత్యం వల్లే యాత్రికులకు ఇబ్బందులు అని ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. దశాబ్దాలుగా లేని ఇబ్బందులు, రాని సమస్యలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఆర్చరీ వరల్డ్ కప్‌లో రెండు బంగారు పతకాలు సాధించిన తెలుగమ్మాయి జ్యోతి సురేఖకు అభినందనలు తెలుపుతూ మరో ట్వీట్ చేశారు. కృషి, పట్టుదలతో దేశానికి జ్యోతి మరెన్నో ఘనతలను తీసుకొస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

లైంగిక వేధింపులపై మళ్లీ రెజ్లర్ల ఆందోళన

మొదటిపేజీ తరువాయి

ఎదురుచూస్తున్నాం" అని తెలిపారు. 'మాకు ఒకే ఒక సమస్య ఉంది. నిరసనకు కారణం ఇప్పటివరకు ఏమీ చేయకపోవడమే... కుస్తీని కాపాడటానికి మేం ఇక్కడ ఉన్నాము" అని రెజ్లర్ బజరంగ్ పునియా అన్నారు. 'మేము మానసిక హింసకు గురవుతున్నాము, ఇది మహిళా అథ్లెట్ల గౌరవం గురించి... మాకు క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి ఎటువంటి స్పందన లేదు, మూడు నెలలు అవుతుంది. కాని చర్యలు లేవు' అని అన్నారు. 'మేం మా నిరసనను క్రీడా మంత్రిత్వ శాఖకు నివేదించినప్పటి నుండి ఎటువంటి చర్య తీసుకోనందున మేము మళ్లీ ఆందోళన చేస్తున్నాం' అని ఒక రెజ్లర్ అన్నారు. "పోలీసులు తదుపరి చర్య తీసుకోవడానికి మేము ఇప్పుడు ఎదురుచూస్తున్నాము' పేర్కొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తూ ఏడుగురు మహిళా రెజ్లర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు ఫిర్యాదు అందిందనీ, ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయడానికి ముందు తమ విచారణను ప్రారంభించామని సీనియర్ పోలీసు అధికారి ధ్రువీకరించారు.

అకాల వర్షం... తీవ్ర నష్టం

మొదటిపేజీ తరువాయి

చెందిన కె.నాంచారమ్మ (90), చల్లపల్లిలోని కమల్ థియేటర్ దగ్గర సైకిల్ షాపు నిర్వహిస్తున్న మస్తాను (57) మృతి చెందారు. కోడూరు, మోపిదేవి, చల్లపల్లి ప్రాంతాల్లో పలుచోట్ల పిడుగుపాటుకు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. వర్షానికి తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో పలుచోట్ల పొలాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయాయి.

కాకినాడ జిల్లా తాళ్లరేవులో సుమారు వంద ఎకరాల్లో వరి పనలు తడిచి ముద్దయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో దాళ్వా వరి మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో కురిసిన వర్షానికి కళ్లాల్లోని ధాన్యం బస్తాలు తడిచిపోయాయి. ఆక్వా చెరువుల్లో ఆక్సిజన్ శాతం పడిపోవడంతో సాగుదారులు ఏరియేటర్లతో పంటను రక్షించుకునే ప్రయత్నం చేశారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 104 సేవలు

- రాష్ట్ర మహాసభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్
- సమస్యలపై ఐక్య పోరాటాలకు పిలుపు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వమే 104 సేవలను నిర్వహించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గతంలో ఈ సేవలను ప్రభుత్వమే నిర్వహించిందని గుర్తుచేశారు. శాసన మండలిలో ఈ డిమాండ్‌ను పిడిఎఫ్ పక్షాన లేవనెత్తుతామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ 104 ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ 6వ రాష్ట్ర మహాసభ విజయవాడ ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, ఎపి రాష్ట్రప్రభుత్వ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు ఈ మహాసభలను ప్రారంభించగా, లక్ష్మణరావు ముఖ్య వక్తగా ప్రసంగించారు. వైద్య ఆరోగ్యశాఖలో అనేక సేవలందిస్తున్న 104 సిబ్బంది ఉద్యోగ భద్రతకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో చేర్చి సమాన పనికి సమానవేతనం అమలు చేయాలన్నారు. మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఇతర ఉద్యోగులను కూడా కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కల్పిస్తామని వైసిపి తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత జివో 7 విడుదల చేసి ఎంటిఎస్ కంటే తక్కువ వేతనం అమలు చేస్తూ 2.45 లక్షల మంది ఉద్యోగులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నా వేతనాలను మాత్రం ప్రభుత్వం పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కల్పిస్తున్న అరకొర సౌకర్యాలు, వేతనాలను సైతం 104 ఉద్యోగులు 125 రోజులు సమ్మె చేసి సాధించుకున్నారని గుర్తుచేశారు. సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్‌లోనూ పోరాటాలను కొనసాగించాలని చెప్పారు. 104 యూనియన్ అధ్యక్షులు విఆర్ ఫణికుమార్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జెఎసి కో చైర్మన్ ఇ విజయ్‌కుమార్ రాజు, సిఐటియు నాయకులు ఎ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

104 సేవలను ప్రభుత్వంలోనే కొనసాగించాలని, డ్రైవర్లు, డిఇవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మహాసభ తీర్మానించింది. ఆప్కాస్‌లో చేర్చి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, వాహన మరమ్మతులు సకాలంలో చేయించి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చేయించాలని మహాసభ తీర్మానించింది. వైద్య ఆరోగ్యశాఖలోని ఖాళీల భర్తీలో అర్హతలను బట్టి 104 ఉద్యోగులకు ప్రాధాన్యతను ఇచ్చి నియమించాలని, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసింది.

నూతన కమిటీ ఎన్నిక

104 ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విఆర్ ఫణికుమార్, సిహెచ్ రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా ఎవి నాగేశ్వరరావులను మహాసభ ఎన్నుకుంది. కోశాధికారిగా డి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కృష్ణారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సుబ్రమణ్యం, బి లోకనాథం, కె వెంకటరావు, ఉపాధ్యక్షులుగా రామరాజు, అప్పలరాజు, త్రిమూర్తులు, డి సందీప్‌కుమార్, కృష్ణవాసు, కార్యదర్శులుగా శ్రీను, బత్తిరెడ్డి, ఎస్‌కె సల్మాన్‌ఖాన్, ఓం ప్రకాష్, శంకర్, మహిళా సబ్ కమిటీ కన్వీనర్‌గా కె రాధిక, కో కన్వీనర్‌గా భువనేశ్వరి, మెంబర్‌గా ఎన్ నాగలక్ష్మిలను ఎన్నుకుంది.

ప్రతిపక్ష నేతకు రక్షణ కల్పించడంలో విఫలం

- డిజిపికి అచ్చెన్నాయుడు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్ష నేతకు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు విమర్శించారు. ఈ మేరకు డిజిపికి ఆదివారం లేఖ రాశారు. చంద్రబాబు నాయుడి పర్యటనకు భద్రత కల్పించాలని ముందుగానే పోలీసులను కోరామని పేర్కొన్నారు. అసాంఘిక శక్తులు దాడి చేసే అవకాశం ఉందని కడప, ప్రకాశం, పల్నాడు జిల్లాల ఎస్‌పిలను ముందుగానే హెచ్చరించామని గుర్తుచేశారు. చంద్రబాబు పర్యటనను అడ్డుకుంటామని మంత్రి ఆదిమూలపు సురేష్ ముందుగానే చెప్పారని వివరించారు. అయినా రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని విమర్శించారు. అధికార పార్టీ గూండాలకు పోలీసులు సహకరించారని పేర్కొన్నారు. మంత్రి సురేష్‌తో పోలీసులు మాట్లాడుతున్న వీడియోలను చూస్తే కుట్రకోణం దాగి ఉందని స్పష్టంగా తెలుస్తోందని తెలిపారు. కోవూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి దినేష్‌రెడ్డి అరెస్టు దుర్మార్గమని మరో ప్రకటనలో అచ్చెన్న పేర్కొన్నారు.

జగన్ పాలనలో అక్రమ కేసులకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిందని, ప్రతిపక్షాన్ని వేధించడమే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయస్వామి విమర్శించారు. దాడి చేసిన వైసిపి గూండాల్ని వదిలి టిడిపి కార్యకర్తలపై కేసులు పెట్టడం దుర్మార్గమని ఒక ప్రకటనలో తెలిపారు.

తన స్వార్థం కోసం జగన్ దళితుల్ని బలిపశువుల్ని చేస్తున్నారని తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివేకా హత్యకేసుపై మంత్రి సురేష్ చేసిన వ్యాఖ్యలకు తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు ఆగ్రహంతో రగిలిపోయారని అన్నారు. ఆ మంట చల్లార్చేందుకు, జగన్ దగ్గర మెప్పు పొందేందుకు తాడేపల్లి పెద్దలతో కలిసి చంద్రబాబుపై సురేష్ దాడికి కుట్ర పన్నారని ఆరోపించారు. జగన్ దోపిడీలను ఎత్తిచూపుతున్నందుకే జగన్ రామోజీరావుపై కక్షసాధిస్తున్నారని టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. మార్గదర్శి పట్ల జగన్ నియంతలా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నిర్బంధించి యువతిపై అత్యాచారం

- ప్రతిఘటించడంతో వేడి నూనె పోసిన యువకుడు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

యువతిని పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు నమ్మించి తన ఇంటికి తీసుకెళ్లి గదిలో నిర్బంధించాడు. ప్రతిఘటించడంతో శరీరంపై వేడినూనె పోసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఏలూరు నగరంలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని దుగ్గిరాల ప్రాంతానికి చెందిన యువతి (23) కాకినాడలోని ఓ కాలేజీలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సవర్ణ అనుదీప్ యువతిని ప్రేమిస్తున్నానని వెంటపడి పరిచయం పెంచుకున్నాడు. ఈ నెల 9న కళాశాలలో ఉన్న యువతికి ఫోన్ చేసి పెళ్లి చేసుకుందామని నమ్మించి ఏలూరు తీసుకొచ్చాడు. నేరుగా తన ఇంటికి తీసుకెళ్లి అక్కడ ఆమెను ఒక గదిలో నిర్బంధించాడు. మరుసటి రోజు రాత్రి పూటుగా మద్యం సేవించిన అనుదీప్ యువతి కాళ్లు, చేతులపై వేడినూనె పోసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అప్పటి నుంచి ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఆదివారం ఉదయం అనుదీప్ బారి నుంచి తప్పించుకుని తన తండ్రికి ఫోన్ చేసి సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు యువతిని చికిత్స నిమిత్తం ఏలూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుదీప్‌ను అదుపులోకి తీసుకొని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

గొప్ప మానవతావాది రామనాథం

- సంస్మరణ సభలో పలువురు వక్తలు



నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

అభ్యుదయ భావాలుగల గొప్ప మానవతావాది, ప్రజల పక్షాన నిలిచిన వ్యక్తి యార్లగడ్డ రామనాథం అని పలువురు వక్తలు అన్నారు. తుది వరకు కమ్యూనిస్టు ఉద్యమంతో నడిచి, కుటుంబాన్ని ఆ దిశగా ప్రోత్సహించిన వ్యక్తి అని కొనియాడారు.

సిపిఎం సానుభూతిపరుడు యార్లగడ్డ రామనాథం సంస్మరణ సభ విజయవాడలోని సున్నపుబట్టీల వద్ద గల అమ్మ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. తొలుత రామనాథం చిత్రపటానికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, సిపిఎం మాజీ ఎంపి, సీనియర్ నాయకులు పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో బి.వి.రాఘవులు మాట్లాడుతూ యార్లగడ్డ రామనాథం మంచి మానవతా వాది అని, ఆయన పిల్లలతో తనకు మంచి సాన్నిహిత్యం ఉందని తెలిపారు. చివరి వరకు విలువలకు కట్టుబడి ఉన్నారన్నారు. ఆయన ఆలోచనలు, భావనలు, విలువలు గొప్పవని, ప్రతిఒక్కరికీ అనుసరణీయుడని కొనియాడారు. రామనాథం పెంపకం ప్రభావం ఆయన కుటుంబంపై ఉందని, వారి పిల్లలు కూడా మంచి సేవ చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షులు గౌరీ శంకర్ మాట్లాడుతూ రామనాథం ఎప్పుడూ సమాజం గురించి ఆలోచించేవారని, ముక్కు సూటిగా వ్యవహరించేవారని, తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరి వరకు ఆచరించారని తెలిపారు. పి.మధు మాట్లాడుతూ రామనాథం మొదటి నుంచి అభ్యుదయ భావజాలంతోనే ఉండేవారన్నారు. ఆయన పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయనతో పనిచేసే వారిని ఆయనతో సమానంగా గౌరవించేవారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక దృక్పథం కలిగిన వ్యక్తి రామనాథమని తెలిపారు. ఆయన భావాలను, ఆలోచనలను ప్రతిఒక్కరూ అనుసరించాలన్నారు. పాపులర్ షూ మార్టు మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రామనాథంతో తక్కువ పరిచయం ఉన్నప్పటికీ వారి కుమారులతో మంచి అనుబంధం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, అక్వా డెవిల్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, బుజ్జి, మహిళా సంఘం నాయకురాలు డి.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మైత్రీ మూవీస్‌తో ఎలాంటి సంబంధం లేదు

- అటవీ భూములు ఆక్రమించామనడం అబద్ధం
- జనసేన కార్పొరేటర్‌పై పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవాలి : బాలినేని

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

సినీ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మైత్రీ మూవీస్‌లో తన వియ్యంకుడి ద్వారా తాను పెట్టుబడులు పెట్టానని వైజాగ్‌కు చెందిన జనసేన పార్టీ కార్పొరేటర్ మూర్తి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు వైజాగ్‌లో అటవీ భూములు ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయించానని చేసిన ఆరోపణలు కూడా పూర్తిగా అబద్ధమని తెలిపారు.

మైత్రీ మూవీస్ సంస్థ నిర్వాహకులు ఎవరో కూడా తనకు తెలియదన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు మైత్రీ మూవీస్ నిర్వాహకులు బాగా తెలుసని, ఆ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయో..? లేవో..? విచారణ చేసుకోవాలని కోరారు. తనపై వచ్చిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఆరోపణలు రుజువు చేయలేకపోతే జనసేన పార్టీ కార్పొరేటర్‌పై పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాని కోరారు. మైత్రీ మూవీస్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులు దాడులు చేస్తున్నారని, తనపై కూడా దాడులు చేయాలన్న ఉద్దేశంతోనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌లాగా ఎస్‌సిల భూములను ఆక్రమించి రొయ్యల చెరువులు సాగు చేసే మనస్తత్వం తనది కాదన్నారు. తనపై కొన్ని పత్రికల్లో తప్పుడు కథనాలు రాస్తున్నారని, కొంత మంది అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. వారిపై పరువు నష్టం దావా వేస్తానని ఫైర్ అయ్యారు.

27 ఉత్తమ పంచాయతీలకు

నేడు రాష్ట్ర స్థాయి అవార్డుల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రస్థాయిలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన 27 గ్రామ పంచాయతీలకు ఈనెల 24న తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ప్రభుత్వం అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేయనుంది. యునిసెఫ్ పేర్కొన్న కొలమానం ప్రకారం ఎంపిక చేసిన తొమ్మిది అంశాల్లో మిషన్ అంత్యోదయ కింద ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. అవార్డులకు ఎంపిక చేసిన ప్రాధాన్యతల్లో పేదరికంలేని మెరుగైన జీవనోపాధుల గ్రామం కింద కడప జిల్లా వివిఎస్ పల్లి మండలం గండిరెడ్డిపల్లి, ప్రకాశం జిల్లా రాచర్ల, నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం మైలూరు పంచాయతీలను ఎంపిక చేశారు. ఆరోగ్యవంతమైన గ్రామం కోటాలో విశాఖపట్టణం జిల్లా దేవరపల్లి మండలం తారువ, హుకుంపేట మండలం భీమవరం, గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం నడింపాలెం పంచాయతీలు ఎంపికయ్యారు. చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్ కింద గుంటూరు జిల్లా పెదకూరపాడు మండలం కాశిపాడు, పశ్చిమ గోదావరి జిల్లా పెనుమంట్ర మండలం నెలమూరు, కృష్ణా జిల్లా జి.కొండూరు మండలం కుంతముక్కల ఎంపికయ్యారు. నీటి సమృద్ధి గల గ్రామం (వాటర్ సఫిషియంట్ పంచాయితీ) కింద కర్నూలు జిల్లా బనగానిపల్లి మండలం ఇల్లురు కొత్తపేట, వైఎస్ఆర్ కడప జిల్లా కోడూరు మండలం, వివి కండ్రిక, ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం దూపాడు పంచాయితీలు, పరిశుభ్రమైన హరిత గ్రామం (క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్) కింద నెల్లూరుజిల్లా తడ మండలం కడలూరు, తూర్పుగోదావరి జిల్లా కోటనందురు మండలం బిల్లనందురు, విజయనగరం జిల్లా సీతానగరం మండలం జోగింపేట పంచాయతీలకు అవార్డులు దక్కాయి. మౌలిక సదుపాయాల్లో స్వయం సమృద్ధి కలిగిన గ్రామం (సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ) కింద శ్రీకాకుళం జిల్లా నందిగాం పంచాయతీ, అనంతపురం జిల్లా అనంతపూర్ రూరల్ మండలం కట్టకిందపల్లి పంచాయతీ, పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం సూరపగూడెం పంచాయతీ, సామాజికంగా సురక్షితమైన గ్రామం (సోషల్లీ సెక్యూర్డు పంచాయితీ) కింద ప్రకాశం జిల్లా యద్దనపూడి మండలం వెస్ట్ పెద్దివారిపాలెం , కర్నూలు జిల్లా ఆదోని మండలం మందగిరి, విజయనగరం జిల్లా రామభద్రాపురం పంచాయతీ ఎంపికయ్యారు. సుపరిపాలన కలిగిన గ్రామం (పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్) కింద తూర్పుగోదావరిజిల్లా సకినేటిపల్లి పంచాయతీ, విశాఖపట్టణం జిల్లా భీమునిపట్నం మండలం నగరపాలెం, కృష్ణా జిల్లా పమిడిముక్కల మండలం చోరగుడి పంచాయతీ ఎంపికయ్యారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ కింద అనంతపురం జిల్లా సికె పల్లి మండలం మేడపురం పంచాయతీ, తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం జేగురుపాడు పంచాయతీ, విశాఖపట్టణం జిల్లా అనకాపల్లి మండలం మార్టూరు పంచాయతీలకు అవార్డులు దక్కాయి. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ఈనెల 24న ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేయడంతోపాటు సామాజిక అంశాలపై చర్చించాలని, పారిశుధ్య కార్మికులను సన్మానించాలని ఆయా జిల్లాల జిల్లా పంచాయితీ అధికారి (డిపిఒ)లు ఆయా గ్రామ సర్పంచ్‌లకు ఆదేశాలు జారీ చేశారు.

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేలా

ప్రవీణ్‌ప్రకాష్ తీరు : ఫ్యాప్టో విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు విద్యావ్యవస్థను గాడిలో పెట్టేవిధంగా కాకుండా నిర్వీర్యం చేసేలా ఉందని ఫ్యాప్టో రాష్ట్రకమిటీ అభిప్రాయపడింది. వ్యవస్థలో లోపాలుంటే సరిదిద్దాల్సిందిపోయి వ్యవస్థ మొత్తాన్ని లోపాల పుట్టగా చూపిస్తున్నారని ఫ్యాప్టో చైర్మన్ ఎన్ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ సిహెచ్ మంజుల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నచిన్న కారణాలతో ఉపాధ్యాయులను నిందించటం, మెమోలు, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్లతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు షూస్, యూనిఫామ్ ధరించలేదని, వర్క్‌బుక్స్ పూర్తిచేయలేదని అనేక కారణాలు చూపిస్తున్నారని వివరించారు. గత విద్యాసంవత్సరంలో జూన్ నుంచి నవంబర్ వరకు పుస్తకాలను సరఫరా చేసిన ప్రభుత్వ లోపం గురించి మాత్రం మాట్లాడటం లేదని విమర్శించారు. ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం సమస్యలకు పరిష్కారం కాదని చెప్తూనే సస్పెండ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులను అనుక్షణం అవమానించేలా ప్రవర్తన కొనసాగుతోందని పేర్కొన్నారు. విద్యా సంబంధ విషయాల్లో లోపాలను గుర్తించినప్పుడు వాటిని పై అధికారిగా సరిదిద్దాలని సూచించారు. అలాకాకుండా వైఫల్యం అంతా ఉపాధ్యాయులదే అన్నట్లుగా ప్రవీణ్ ప్రకాష్ తీరు ఉందని, దీనిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. గతేడాది మొత్తంలో నాడు-నేడు, పాఠశాలల విలీనం, ప్రమోషన్లు, వర్క్ అడ్జస్ట్‌మెంట్లు పేరుతో జూన్ నుంచి ఫిబ్రవరి వరకు ఉపాధ్యాయులను గందరగోళ పరిస్థితికి గురిచేశారని తెలిపారు. రక రకాల యాప్‌ల భారాన్ని ఉపాధ్యాయులపై మోపి పాఠాలు చెప్పలేని పరిస్థితి కల్పించారని, ఇప్పుడు విద్యాసంవత్సరం చివరిలో తనిఖీలంటూ హడావుడి ఎందుకో అర్థం కాని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఇదే కొనసాగితే వచ్చే విద్యాసంవత్సరంలో తల్లిదండ్రులు నమ్మకం కోల్పోయి వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించే పరిస్థితి ఉంటుందని తెలిపారు. మొత్తం విద్యావ్యవస్థను ప్రైవేట్‌పరం చేయడానికి పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా ప్రవీణ్ పర్యటనలు ఉన్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే ఉపాధ్యాయ లోకాన్ని ఒత్తిడి నుంచి కాపాడుకోవడం కోసం ఉద్యమిస్తామని హెచ్చరించారు.

చిత్తశుద్ధి ఉంటే బోధనేతర పనులు రద్దు చేయండి
విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిపై ఎపిటిఎఫ్

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి చిత్తశుద్ధి ఉంటే ఉపాధ్యాయులకు అన్ని రకాల బోధనేతర పనులను రద్దు చేసి అకడమిక్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎపిటిఎఫ్ డిమాండ్ చేసింది. ఆయన వైఖరి ప్రభుత్వ విద్యపై సామాన్య ప్రజలకు సైతం అపనమ్మకం కలిగించే విధంగా ఉందని ఆ ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ చిరంజీవులు, జి హృదయరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల్లో చేసిన సస్పెన్షన్‌లను రద్దు చేసి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలని కోరారు.

మార్గదర్శి, విభజనచట్టంపై పోరాటానికి జగన్ అండ : ఉండవల్లి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి అక్రమాలపై, రాష్ట్ర విభజన చట్టంపై తాను చేస్తున్న ఒంటరి పోరాటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. అందువల్ల ఎవరేమనుకున్నా కొంతకాలంపాటు జగన్ ప్రభుత్వంపై విమర్శలకు దూరంగా వుంటానని చెప్పారు. ఆదివారం విజయవాడ ఎంబివికెలో స్వర్ణాంధ్ర దినపత్రిక ఆధ్వర్యాన 'రామోజీరావు మార్గదర్శిలో అక్రమాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. స్వర్ణాంధ్ర సంపాదకులు కెబిజి తిలక్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అరుణ్‌కుమార్ మాట్లాడారు. మార్గదర్శిలో చట్టవిరుద్ధంగా వ్యవహరించారనే అంశాన్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో కేసు వేశానని తెలిపారు. తాను కేసువేయగానే మార్గదర్శి ఫైనాన్స్‌లో డిపాజిట్లు తీసుకోవడం తప్పేనని మార్గదర్శి ఫైనాన్స్‌ను మూసేశారని అన్నారు. మార్గదర్శి చిట్స్‌లోని లావాదేవీలను జాతీయబ్యాంకులతో నిర్వహించాలనే నిబంధనను కూడా ఉల్లంఘించారని తెలిపారు. ఈ చట్ట ఉల్లంఘన అంశాలను వెలుగులోకి తేవాలని పోరాటం చేస్తుంటే ప్రతిపక్షాలు, ఆడిటర్ల సంఘం, లాయర్ల సంఘాలు తనను తప్పుపట్టడం సరైందికాదని చెప్పారు. ఈ పోరాటం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారని, వైఎస్సార్ కాంగ్రెస్ ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం వుందని అన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాది ఎస్ సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ మార్గదర్శిలో తప్పు జరిగిందని అంగీకరించారని తెలిపారు. ఈ అంశం కోర్టుపరిధిలో వున్నందున చర్చ అనవసరమని అన్నారు. గతంలో డిపాజిట్లు సేకరించాం, ఇప్పుడు సేకరించడం లేదంటున్నారని చెప్పారు. నిబంధనల ప్రకారం డిపాజిట్ల సేకరణ చేయకూడదని అన్నారు.

గ్రామీణ రైతాంగానికి సేవలందించేందుకు రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలి

- ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ రైతాంగానికి సమర్ధవంతమైన సేవలందించాలంటే రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలని, డిసిసి బ్యాంకులను ఆప్కాబ్ బ్రాంచిలుగా మార్చడంతోపాటు రుణాలపై వడ్డీ భారాలు తగ్గించాలని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబు డిమాండ్ చేశారు. పిఎసిఎస్‌ల నుంచి టిడిఎస్ వసూలు చేయాలని కేంద్రప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆర్డర్ సహకార సంఘాలను కూడా దెబ్బతీసే విధంగా ఉందన్నారు. సహకార వ్యవస్థలో పనిచేసే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ అనుబంధం) ఆధ్వర్యాన విజయవాడలోని ఓ హోటల్‌లో బిఎస్ రాంబాబు అధ్యక్షతన ఆదివారం రాష్ట్ర సెంట్రల్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సంఘ కార్యకలాపాల నివేదికను సంఘం ప్రధాన కార్యదర్శి కెవిఎస్ రవికుమార్ నివేదికను ప్రవేశపెట్టారు. అనంతరం బిఎస్ రాంబాబు సమావేశం వివరాలను మీడియాకు వివరించారు. రాష్ట్రంలో కో-ఆపరేటివ్ బ్యాంకు విషయాలపై చర్చించామని, 198 సెక్షన్ విధానం అమలు చేయవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. రైతులకు ప్రత్యక్షంగా సేవలందిస్తున్న వ్యవస్థలను ప్రభుత్వాలు గమనంలోకి తీసుకోవాలన్నారు. 62 సంవత్సరాల పదవీ విరమణ వయసును అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పెన్షన్ సామాజిక భద్రత అని, సహకార బ్యాంకు ఉద్యోగులకు పెన్షన్ అమలు చేయడం లేదని విమర్శించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ విషయంలో కూడా ఉద్యోగులకు రెండు శాతం ట్యాక్స్‌ను రద్దు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమాల ద్వారా ప్రభుత్వంపై వత్తిడి పెంచి తమ హక్కులను సాధించుకుంటామని ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బిఎస్ రాంబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ వెలుగులూరి రాధాకృష్ణమూర్తి, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ తోట రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు జి.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఇజ్రాయిల్‌లో మళ్లీ నిరసనల హోరు

- న్యాయ వ్యవస్థను బలహీనపరచొద్దంటూ భారీ ర్యాలీలు
- ఇరకాటంలో నెతన్యాహు సర్కార్

జెరూసలేం : న్యాయ సంస్కరణల పేరుతో న్యాయవ్యవస్థను నిరీర్యం చేసే నెతన్యాహు ప్రభుత్వ యత్నాలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌లో మళ్లీ నిరసనలు హోరెత్తాయి. బెంజమిన్ నెతన్యాహు, అతని జాతీయవాద కూటమి చేపట్టిన న్యాయ సంస్కరణలను వెనక్కి తీసుకునేంతవరకు తమ పోరాటం ఆగదని నిరసన కారులు స్పష్టం చేశారు. సుప్రీంకోర్టుపై ప్రభుత్వ పెత్తనం చలాయించాలని నెతన్యాహు ప్రభుత్వం భావిస్తుండగా, దీనికి వ్యతిరేకంగా ఇదివరకే ఒకసారి ఎత్తున సమ్మెలు, ప్రదర్శనలు జరిగాయి. దీంతో ఈ సంస్కరణల బిల్లుపై ఏకాభిప్రాయం సాధించేందుకు ప్రయత్నిస్తామని, అంతవరకు దీనిని నిలిపేస్తున్నామని నెతన్యాహు ప్రకటించారు. వీటిపై నెతన్యాహు ప్రభుత్వం మళ్లీ ముందుకు వెళుతోంది. దీంతో నిరసనలు మరోసారి భగ్గుమన్నాయి. ప్రజాస్వామ్య దేశానికి కీలకమైన న్యాయవ్యవస్థ పనితీరుకు కొత్త సంస్కరణలు అడ్డం పడతాయని, న్యాయవ్యవస్థపై సంపూర్ణ అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఇజ్రాయిల్ పబ్లిక్ బ్రాడ్‌కాస్టర్ విడుదల చేసిన పోల్ ప్రకారం.. 53 శాతం మంది మంది ఈ సంస్కరణలు దేశానికి హాని కలిగిస్తాయని నమ్ముతున్నారు. మరో 48 శాతం మంది న్యాయవ్యవస్థలో సంస్కరణలతో దేశంలో పరిస్థితి మరింత దిగజారుతుందని అభిప్రాయపడ్డారు. నూతన న్యాయవ్యవస్థ సంస్కరణలతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభిస్తుంది. అలాగే సుప్రీంకోర్టు తీర్పులను రద్దు చేసే అధికారాన్ని పార్లమెంట్‌కు లభిస్తుంది.

కార్యకర్తలపై దాడులు సహించం : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జనసేన కార్యకర్తలపై వైసిపి నాయకులు, కార్యకర్తలు దాడులు చేస్తే సహించేది లేదని రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం గూడూరు మండలం ఆకుమర్రు, ఉమ్మడి విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం బెవరపేట గ్రామాల్లో జనసైనికులపై వైసిపి చేసిన దాడిలో ఆకుమర్రులో ముగ్గురు, బెవరపేటలో 12మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. వైసిపి అక్రమాలను ప్రశ్నించినందుకు తమ కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా అక్రమ కేసులు పెట్టడమేమిటని నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు.



టిటిడి పేరుతో నకిలీ వెబ్‌సైట్

- పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- తిరుమల:

తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో మరో నకిలీ వెబ్‌సైట్‌ను టిటిడి ఐటి విభాగం ఆదివారం గుర్తించింది. దీనిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎఫ్ఐఆర్ 19/2023 యు/ఎస్ 420, 468, 471 ఐపిసి ప్రకారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎపి ఫోరెన్సిక్ సైబర్‌సెల్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో సైబర్ సెల్ అధికారులు నకిలీ వెబ్‌సైట్‌పై విచారణ ప్రారంభించారు. ఇదివరకే 40 నకిలీ వెబ్‌సైట్లపై కేసులు నమోదు కాగా, దీంతో కలిపి కేసుల సంఖ్య 41కి చేరింది. అధికారిక వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.in అని ఉండగా, చిన్న మార్పులతో కొందరు వ్యక్తులు రూపొందించిన https://tirupatibalaji-ap-gov.org నకిలీ వెబ్‌సైట్‌ను టిటిడి గుర్తించింది. టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లోనే శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు, గదులు బుక్ చేసుకోవాలని టిటిడి అధికారులు సూచించారు.


భక్తులకు భోజనం వడ్డిస్తున్న టిటిడి అధికారులు

తిరుమలలో ఫుడ్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుమల

కరోనా కారణంగా మూతపడ్డ ఫుడ్ కౌంటర్ టిటిడి తిరిగి ప్రారంభించింది. టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ఎవి.ధర్మారెడ్డి ఆదేశాల మేరకు తిరుమలలో సామాన్య యాత్రికుల సౌకర్యార్థం పిఎసి-1 వద్ద ఆదివారం ఫుడ్ కౌంటర్‌ను టిటిడి అధికారులు ప్రారంభించారు. ఇక్కడ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, సాయంత్రం 6.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తారు. పిఎసి-1లో బసచేసే సామాన్య యాత్రికులకు ఈ ఫుడ్ కౌంటర్ సౌకర్యవంతంగా ఉంటుంది. వెంగమాంబ అన్నప్రసాద భవనంతోపాటు పాత అన్నదానం కాంప్లెక్స్, పిఎసి-2లో అన్నప్రసాద వితరణ జరుగుతోంది. వీటితోపాటు రాంభగీచా బస్టాండ్, కేంద్రీయ విచారణ కార్యాలయం వద్ద ఫుడ్‌కౌంటర్లు ఉన్నాయి. దీంతో కలిపి మొత్తం ఫుడ్‌కౌంటర్లు మూడుకు చేరాయి. కార్యక్రమంలో రిసెప్షన్ డిప్యూటీ ఇఒ హరీంద్రనాథ్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఎఇఒ గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి కాంట్రాక్టు కార్మికుల మెరుపు సమ్మె

- రెండు వేల మంది విధులకు గైర్హాజరై నిరసన
- టైం స్కేలు ఇవ్వాలని, వేతనాలు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి- తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. 'అయినవారికి ఆకుల్లో.. కానివారికి కంచాల్లో' అన్న చందంగా వ్యవహరిస్తూ కొందరిని పర్మినెంటు చేసి దర్శనం, లడ్డూ కార్డులు ఇచ్చారని, తమకేమో ప్రస్తుతం ఇస్తున్న జీతాన్ని రూ.11 వేల నుంచి 8 వేలకు కుదించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు వేల మంది కార్మికులు విధులకు గైర్హాజరై నిరసన తెలిపారు. తిరుపతిలోని మున్సిపల్ పార్కు సమీపంలో బైఠాయించారు. తమకు టైమ్ స్కేలు, గుర్తింపు కార్డులు, లడ్డూ కార్డులు, శ్రీవారి దర్శన సౌకర్యం, స్విమ్స్‌లో ఉచిత వైద్య సేవలు కల్పించే వరకు తాము విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు. టిటిడి కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటూ తమను మభ్యపెట్టి టిటిడి మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకూ సమ్మెను కొనసాగిస్తాంటూ టిటిడి ఆరోగ్యశాఖ అధికారికి నోటీసు అందించారు. అధికారులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ కార్మికులు మాత్రం వెనుకంజ వేయలేదు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం, టిటిడి కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షులు టి సుబ్రహ్మణ్యం, శ్రామిక మహిళా కన్వీనర్ ఆర్ లక్ష్మి, సిఐటియు నగర కార్యదర్శి వేణు, నాయకురాలు బుజ్జి, ఇతర ట్రేడ్ యూనియన్ నాయకులు చిరంజీవి, రాజా, యుగంధర్, ఎన్‌డి శ్రీను, చంద్రశేఖర్‌రెడ్డి కార్మికులకు మద్దతు తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని టిటిడి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.


సమ్మె చేస్తున్న టిటిడి కాంట్రాక్టు కార్మికులు

ధాన్యం రవాణాలో ఇబ్బందులు తొలగించాల్సిందే

జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - భీమడోలు (ఏలూరు జిల్లా)

ధాన్యం కొనుగోలుకు పూళ్ల కేంద్రంగా ఏర్పాటు చేసిన ఏజెన్సీలో ధాన్యం రవాణాకు సరిపోయే వాహనాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా భీమడోలులో ఎపి రైతు సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. వాహనాల ఏర్పాటుపై రెండు రోజుల క్రితం భీమడోలు జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు ఇచ్చిన హామీతో రాస్తారోకోను విరమించారు. కానీ ఆదివారానికి సైతం అధికారులు ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో వారు మరోసారి ఏజెన్సీ పరిధిలోని పుంతరోడ్లపై రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ లింగరాజు మద్దతు తెలిపారు. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు బస్తాల్లో సిద్ధం చేశారన్నారు. రవాణా సమస్యల ఏర్పడడంతో రైతుల వద్దే ధాన్యం ఉండిపోయిందన్నారు. వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీలను ఏర్పాటు చేయాలని కోరారు. ఎకరాకు 110 నాణ్యమైన గోనె సంచులను అందజేయాలని డిమాండ్ చేశారు. నూక శాతం పేరుతో బస్తాకు రూ.80 నుంచి రూ.120 వరకూ వసూలు చేస్తుండడం తగదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, ఎపి కౌలు రైతుల సంఘ జిల్లా సమన్వయకర్త, సహాయ సమన్వయకర్త కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తితో పాటు అధిక సంఖ్యలో రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ఎడి కార్యాలయాల వద్ద మే 20న ధర్నాలు

- ఎపి చేనేత కార్మిక సంఘం పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

చేనేత రంగ పరిరక్షణ కోసం మే 20వ తేదీన ఎడి కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన జారీ చేశారు. ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం కట్టా శివదుర్గారావు అధ్యక్షతన కర్నూలు జిల్లా శ్రీశైలంలో శుక్రవారం నిర్వహించిన సమావేశ నిర్ణయాలను వెల్లడించారు. నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి చేనేత కార్మికునికి, ఉపవృత్తుల వారికి వర్తింపజేయాలని, వెయ్యి అడుగుల స్థలం ఉన్నవారికి నేతన్న నేస్తం చేనేత పెన్షన్లు రద్దు చేయడం సరికాదని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఇస్తున్న ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయాన్ని రూ.ఐదు లక్షలకు పెంచాలని, ప్రతి చేనేత కార్మికునికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్తును ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం 45 ఏళ్లకే చేనేత పెన్షన్లు ఇవ్వాలని, చేనేతపై పూర్తిగా జిఎస్‌టి రద్దు చేయాలని కోరారు. యారన్ సబ్సిడీ, పావలా వడ్డీ, త్రిఫ్ట్‌ఫండ్, రిబేటు డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడంతో జిడిసిసి బ్యాంకు వద్ద అప్పు తీసుకున్న సహకార సంఘాలు వడ్డీలు కూడా చెల్లించలేక నష్టాల బారిన పడుతున్నాయని తెలిపారు. దీనివల్ల చేనేత కార్మికులకు సహకార సంఘాలు పనులు చూపించలేకపోతున్నాయని పేర్కొన్నారు. ఈ దృష్ట్యా సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.వంద కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె రాజు, సహాయ కార్యదర్శులు వి గంగాధరరావు, డి రామారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ వీరబ్రహ్మం, ఎన్ చంద్రకళ, వి శివన్నారాయణ, కె లక్ష్మన్న, జి రాజు, కె వెంకటేశ్వరరావు, భరణి కాలప్ప పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్తు తీగలు తగిలి రైతు మృతిచెందిన ఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం ఎం బోయపల్లిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకోవడానికి అదే గ్రామానికి చెందిన రైతు నాగభూషణం తన పొలంలోని కంచెకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేశారు. రైతు మేఘనాథం (39) తన పాడి ఆవు కనిపించకపోవడంతో వెతుకుంటూ శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లారు. పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలను చీకట్లో గుర్తించక వాటికి తగిలారు.

దీంతో విద్యుదాఘాతానికి గురై మేఘనాథం అక్కడికక్కడే మరణించారు. ఆదివారం ఉదయం అటుగా వెళుతున్న కొందరు వ్యక్తులు దీనిపై గ్రామస్తులకు, తవణంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేసుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మేఘనాథానికి భార్య ఉంది. పిల్లలు లేరు.


విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన రైతు మేఘనాథం


సింహాచలానికి పోటెత్తిన భక్తులు

అప్పన్న చందనోత్సవంలో భక్తులకు ఇక్కట్లు

- మంత్రులు, అధికారులకు నిరసన సెగ

ప్రజాశక్తి - సింహాచలం (విశాఖపట్నం)

సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో భక్తులు ఆదివారం తీవ్ర ఇక్కట్లు పడ్డారు. అడుగడుగునా ప్రభుత్వ వైఫల్యం కనిపించింది. రూ.1500 విలువైన వివిఐపి టికెట్లను నియంత్రించకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూ లైన్లలో ఉన్న వారు ఇఒకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దర్శనానికి వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర అదికారులను నిలదీశారు. మరోవైపు విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానంద స్వామి, స్వాత్మానంద స్వామి.. అప్పన్న దర్శనం అనంతరం చందనోత్సవ ఏర్పాట్లపై అసహనం వ్యక్తం చేశారు. గర్భాలయంలో పోలీసుల జులుం ఎక్కువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులకు ఎటువంటి సౌకర్యాలూ లేకపోగా దేవస్థానం అధికారులు, పోలీసుల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆరు నెలలుగా దేవాలయానికి ఇఒను కేటాయించకుండా ఇన్‌ఛార్జితో నడపడం వల్లే పలు సమస్యలు తలెత్తాయని అన్నారు.

దర్శనాలు.. సమస్యలు

అప్పన్నను మొదటిగా ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక గజపతిరాజు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, టిటిడి తరుపున వైవి.సుబ్బారెడ్డి దంపతులు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రజాప్రతినిధులకు, వివిఐపిలకు స్వామి దర్శనం కల్పించారు. లెక్కకు మించి అంతరాలయ దర్శనాలు కల్పించడంతో సామాన్య భక్తులతోపాటు వివిఐపిలకూ ఇక్కట్లు తప్పలేదు. దీంతో ఆలస్యంగా మేల్కొన్న అధికారులు ఉదయం 10 గంటల తర్వాత అంతరాలయ దర్శనాలు నిలిపివేశారు. అప్పటికే గంటల తరబడి క్యూ లైన్లలో వేచి ఉన్న వారంతా మంత్రులు కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణను ఏర్పాట్లపై నిలదీశారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయని, క్యూలైన్ల పద్ధతి బాగోలేదని, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో పలువురు కళ్లు తిరిగిపడిపోయారు.


నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు జగన్

విశాఖ పోర్టు ఆస్తుల ప్రయివేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ పోర్టు స్టేడియం, కల్యాణ మండపాలను ప్రయివేటుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం పోర్టు స్టేడియం వద్ద పోర్టు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోర్టు స్టేడియం, కల్యాణ మండపాలు ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చినవి కాదని, ఇక్కడి కార్మికుల శ్రమతో వారి సంక్షేమం, అభివృద్ధి కోసం వీటిని ఏర్పాటు చేశారని తెలిపారు. కార్మిక చట్టాల్లో భాగంగా వెల్ఫేర్ మెజర్స్ కింద ఇవి వచ్చాయన్నారు. పోర్టు స్టేడియంలో జివిఎంసి, స్పోర్ట్స్ అకాడమీ వారి షేర్లు కూడా ఉన్నాయని, అవి ప్రజల డబ్బుతో సమకూర్చినవేనని తెలిపారు. ప్రజల పన్నుల ద్వారా సమకూరిన ఆదాయంతో ఏర్పడిన స్టేడియాన్ని ప్రయివేట్‌కు ధారాదత్తం చేయడం దారుణమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అనుచరులకు ఇండోర్ స్టేడియాన్ని ఇచ్చారని, ఈ విషయంలో సంబంధిత ఎమ్మెల్యే ప్రజల పక్షాన ఉంటారో? కాంట్రాక్టర్ పక్షాన ఉంటారో తేల్చుకోవాలని అన్నారు. ఈ ఆందోళనలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు పోర్టు ఎఒబి వద్ద జరిగే ధర్నాకు పోర్టు కార్మికులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి జగన్, లక్ష్మణరావు, ఎఐటియుసి నాయకులు బిసిహెచ్ మసేన్, హెచ్ఎంఎస్ నాయకులు అంజి, ఐఎన్‌టియుసి నాయకులు జి సందు, సిఎఫ్‌టియుఐ నాయకులు ఎన్ కనకారావు, తిలక్, పోర్టు యూనియన్ల నేతలు సత్యనారాయణ, త్రినాథరావు, నరసింగరావు, యల్లారావు, రమణ, బాబు, వాకర్స్ పాల్గొన్నారు.


కర్నూలు జిల్లాలో ఆదోని మండలంలో యువగళం పాదయాత్రలో లోకేష్

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం

- న్యాయవాదులతో లోకేష్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలా మాయమాటలు చెప్పి మోసం చేసేవాళ్లం కాదన్నారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో సాగింది. కడితోట క్యాంప్ శిబిరం నుంచి ప్రారంభమైన యాత్ర గనేకల్ క్రాస్, జాలమంచి, పాండవగల్, బలేకల్‌క్రాస్, కుప్పగల్ మీదుగా పెద్ద తుబంలం క్రాస్ వరకూ కొనసాగింది. కుప్పగల్లులో న్యాయవాదులతో లోకేష్ భేటీ అయ్యారు. నాలుగేళ్లుగా మాయమాటలు చెబుతున్న జగన్ కర్నూలులో హైకోర్టుకు ఒక్క ఇటుకైనా పెట్టారా? అని ప్రశ్నించారు. జగన్ చెప్పే అబద్ధాలు తియ్యగా, తాము చెప్పే నిజాలు చేదుగా ఉన్నాయని, న్యాయవాదులు నిజానిజాలు తెలుసుకోవాలన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని టిడిపి నిర్ణయం తీసుకుందని, అధికారంలోకి రాగానే ఏర్పాటు చేస్తామని తెలిపారు. జూనియర్ లాయర్లకు స్టయిఫండ్ ఇస్తామని, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కుప్పగల్లులో బిసి నేతలతో లోకేష్ భేటీ అయ్యారు. ప్రభుత్వం బిసి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతోందని, వాల్మీకులకు, గొర్రెల కాపరులకు, దూదేకులకు ఎలాంటి సాయమూ అందడం లేదని పలువురు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. టిడిపి అధికారంలోకి రాగానే శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని, బిసిల కోసం రక్షణ చట్టం చేస్తామని హామీ ఇచ్చారు. మంగళగిరి శివాలయం ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్, వైసిపి నాయకులు మునగపాటి వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చినరాజా, సోదరుడు రమేష్ లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. యాత్రలో మాజీ ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఆదోని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ మీనాక్షి నాయుడు, మాజీ ఇన్‌ఛార్జ్ గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు. ఆదివారం మొత్తంగా 15.2 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది.

మోడీ పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

నేడు "జై భారత్ సత్యాగ్రహ" బహిరంగసభ : కాంగ్రెస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పిసిసి రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అదాని అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేసేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 24న సాయంత్రం విజయవాడ జింఖానాగ్రౌండ్స్‌లో "జై భారత్ సత్యాగ్రహ" పేరుతో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు రంజితా రంజన్, రాజ్యసభ మాజీ సభ్యులు కెవిపి రామచంద్రరావు, మాజీ ఎంపిలు చింతామోహన్, జెడి శీలం, కొప్పుల రాజులతో పాటు పలువురు సీనియర్ నేతలు హాజరవుతారని తెలిపారు.

'బోరు'మంటున్న రైతులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం తిలారుకు చెందిన సూరపు వెంకటరావుకు మూడు ఎకరాల పొలం ఉంది. వర్షాధారంగా వరి సాగు చేస్తున్నారు. 2020 సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం 'వైఎస్ఆర్ జలకళ పథకం' ప్రకటించడంతో దరఖాస్తు చేసుకున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఆయన పొలంలో అధికారులు బోరు వేశారు. ఆ తర్వాత విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ కనెక్షన్ ఇస్తే రెండో పంట కూడా వేసుకుందామని అనుకుంటున్న తరుణంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు వెనక్కి తీసుకెళ్లిపోయారు.

ఇదే మండలం చీపుర్లుపాడు పంచాయతీ ఊడికలపాడుకు చెందిన నేతింటి వెంకటరావు పొలంలో ఏడాది కిందట అధికారులు బోరు వేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినా నేటికీ కనెక్షన్ ఇవ్వలేదు. ఈ సమస్య వీరిద్దరికే పరిమితం కాదు.. సాగు నీటి సౌకర్యం లేక బోర్లు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎదురుచూస్తున్న లక్షలాది మంది రైతుల పరిస్థితి ఇలానే ఉంది.

నవరత్నాల్లో భాగంగా భూగర్భ జలాలను వినియోగించుకుని రైతుల జీవన ప్రమాణాలను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం సెప్టెంబర్ 28, 2020లో వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ప్రారంభించింది. అదే సంవత్సరం అక్టోబర్ తొమ్మిదిన పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై జిఒ నంబరు 676 వెలువరించింది. 2.5 ఎకరాల నుంచి ఐదెకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. పథకం కింద బోర్లతో పాటు విద్యుత్ కనెక్షన్లను పూర్తి ఉచితంగా అందిస్తామని చెప్పడంతో రాష్ట్రవ్యాప్తంగా 2,28,421 మంది దరఖాస్తు చేసుకున్నారు. బోర్ల తవ్వకాలు, మోటార్ల పంపిణీ, విద్యుత్ కనెక్షన్లకు భారీ ఎత్తున నిధులు వెచ్చించాల్సి రావడంతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరులో పథకంలో స్వల్ప మార్పులు చేసింది. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు మాత్రమే రూ.రెండు లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చును భరిస్తామని పేర్కొంది. రైతులు అందుకు సిద్ధపడినా ఆ డబ్బులనూ విడుదల చేయలేదు. జలకళ కింద ఇవ్వనున్న ఉచిత బోర్లలో ప్రభుత్వం రకరకాల పిల్లిమొగ్గలు వేయడంతో పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

లక్షల్లో దరఖాస్తులు... వందల్లో విద్యుత్ కనెక్షన్లు

రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 2,28,421 దరఖాస్తుల్లో 1,88,571 దరఖాస్తులకు విఆర్ఒలు అప్రూవల్ ఇచ్చారు. అర్హత సాధించిన వాటిలో 66,190 దరఖాస్తులకు భూగర్భ జలశాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వాటిలో 42,388 చోట్ల బోర్ల తవ్వకాలకు కలెక్టర్లు పరిపాలనా అనుమతులు జారీ చేశారు. ఇప్పటివరకు 19,908 చోట్ల బోర్లను వేశారు. వాటిలో కేవలం 1721 మంది రైతులకే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ప్రభుత్వం తొలుత వెలువరించిన మార్గదర్శకాల ప్రకారం వాటిలో కేవలం 1721 మంది రైతుల పొలాలకే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు రూ.రెండు లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఒక్క కనెక్షనూ మంజూరు చేయలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికైన ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది.

జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ

ప్రజాశక్తి - పలాస (శ్రీకాకుళం జిల్లా)

జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించాలని, 80 కిలోల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, ఆలిండియా కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని లాస్య ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు అధ్యక్షతన జీడి రైతుల సదస్సు ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే జీడి పిక్కలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీడికి మద్దతు ధర కల్పించకపోవడంతో జీడి రైతులు దళారుల దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ మాదిరిగా జీడి పంటకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వాతావరణ బీమా అమలు చేయాలని కోరారు. జీడి పంట అభివృద్ధికి ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా నిధులు అందించాలని, జీడి పిక్కలు, జీడి పళ్ల ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జీడిపప్పు ధర పెరుగుతున్నా, పిక్కల ధర మాత్రం గణనీయంగా తగ్గిపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని మద్దతు ధర ప్రకటించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా జీడి రైతులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం జీడి రైతుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా తెప్పల అజయ్ కుమార్, కమిటీ సభ్యులుగా డి.తాతారావు, టి.భాస్కరరావు, ఎస్.కుమార్, కె.ధనరాజు, ఆర్.పురుషోత్తం, కె.పురుషోత్తం, ఎం.రామారావు, పి.కుసుమతోపాటు 26 మందిని ఎన్నుకున్నారు. సదస్సులో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, బి.రామకృష్ణ నాయుడు, ఎస్.గోపి, కె.హేమసూదన్, పలాస, మందస, సోంపేట, వజ్రపుకొత్తూరు మండలాల్లోని జీడి రైతులు పాల్గొన్నారు.



నిర్జీవ పరిణామం


ఇప్పుడు దైవదత్తమే రాజ్యమిక్కడ..!
మనువు, తనువుల ముందు
జన్యువు పెద్ద పాప పరిహారం
సృష్టికర్తకు, డార్విన్‌కి మధ్య పోలికెక్కడ?
నక్కా, నాకలోకం ఒక్కటా..! మరి..!
జనం బుర్రను తొలిస్తేనో,
నెత్తిన కాలేసి పాతాళానికి తొక్కితేనో
గుండెలు చీలిస్తేనో కదా!
అవతార్లుగా నిలిచిపోయేది
కణం కేంద్రకంతో కలిసి కాటికాపరిలా
తిరిగినవాడు..
నేటికీ మనిషి గురించే ఒంటరిగా మిగిలిపోయాడు..!
శాస్త్రీయంగా పాఠ్యాంశం నుంచి తొలగిపోయాడు
వానరుడే నరుడయ్యాడని ఒప్పించడం
అంత తేలికేమీ కాదు..!
ఆదిలో పంచభూతాల్ని
పరబ్రహ్మ స్వరూపాలుగా ఒప్పుకు తీరాలి
హోమంలో కాలిపోయి, యాగంలో మునిగిపోవాలి
గాలిలో బూడిదిలా ఎగిరిపోవాలి!
అప్పుడే జీవపరిణామాన్నే కాదు
సజీవ స్వప్నాల్ని సైతం శాస్త్రోక్తంగా
దహనం చేసే కిష్కింధకాండ
సుసాధ్యమయ్యేది...!
హేతువును నిట్టనిలువునా నిలదీసి
ఉరితీసిన జీవులకు..
అబద్ధాన్ని జ్ఞానసముపార్జనగా ఆచరించడం
ప్రాణసుఖం కదా..!
కోతిలోను, రాతిలోను దాగిన
సారస్వతానికి సాష్టాంగం చేయడం
అరాచక నీతికి ఎంత బలం..!
శిరచ్ఛేదనాల చరితకు పచ్చతోరణం కదా..!
ఇక కిరణం దైవరూపం
జన్య సంయోగం ఇక క్రియ కాదు
అది కర్మకాండ
సకల ప్రాణకోటిలో పరమాత్మను దర్శించి
మనిషికి మాత్రమే ..
వర్ణాలను అద్ది నిర్జీవంగా నిలబెట్టే
దీపదూప నైవేద్య ప్రక్రియ
నమ్మండి..! లేదా చావండి..!!

– డా. జికెడి ప్రసాద్
93931 11740

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 24 ఏప్రిల్ 2023



"సాగిపోవుటె బతుకు
ఆగిపోవుటె చావు
సాగిపోదలిచిన
ఆగరాదిచటెపుడు "


– కాళోజి

శ్రీశ్రీ సంతకం

'మరో ప్రపంచం... మరో ప్రపంచం...'
మళ్లీ ... మళ్లీ ఈ మాట వినపడుతూనే వుంది
చూద్దామని ఒక్కసారి తలుపులు తట్టాను
వెంటనే ద్వారాలు తెరుచుకున్నాయి
ఆహ్వానిస్తూ శ్రీశ్రీ మహాప్రస్థానం
చూస్తున్న నా నేత్రాల నిండా
లక్ష టన్నుల ఆశ్చర్యం...
నమ్మలేని నిజాలు,
సాక్షాల సంతకాలతో
కవాతు చేస్తూ నిలబడ్డాయి
ధగ ధగలాడే ఆ మరో ప్రపంచంలో...
అన్ని దేశాల తలరాతల్ని
చెమట చుక్కలే రచిస్తున్నాయి
పాలకులెవరూ లేరక్కడ
ఉన్నదంతా సేవకులు మాత్రమే
ప్రజల అందరి శిరస్సు మీద
త్యాగాల తలకట్టులు...
నిత్యం పరిమళించే మట్టివాసన
తన రూపాన్ని ప్రాణవాయువుగా
మార్చుకుంటుందక్కడ...
నేరాలు, ఘోరాలు, ఉరితీతలు
సమస్తం సమాధుల్లో శాశ్వతంగా విశ్రాంతి
భూమికి భారమైన బద్ధకం
రోజూ బద్దలవుతున్న దాఖలాలు
కులం, మతం, వర్గం, వర్ణాలు
కలిసికట్టుగా ఆవిరైపోతున్న దృశ్యాలు
గణగణమని గంటలు గుడుల్లో కాదు
గుండెలు మాట్లడుకుంటున్న మందిరాల్లో
మనిషిని, మనిషి హత్తుకున్నప్పుడు
వినిపించేది లబ్ డబ్ శబ్దాలు కాదు
నేను, నీకు ఉన్నానంటూ
భుజంతట్టి ఇచ్చే భరోసాలు
మనిషి నిలబడితే చాలు..
మానవత్వం నిచ్చెనతో
ఆకాశం సైతం అందుతోంది
మంచితనం కొలతల్లో...
కొలతలకు అందని ఎత్తులు అందరివి
దోచుకుని, దాచుకోవటం తెలియని
జనం వొంటినిండా...
అన్నీ మంచితనం అంగవస్త్రాలే
త్యాగాల జాతరలో మనిషి,
మహోత్తరంగా
వెలగటం ప్రారంభించాక
ఆకాశం ఆరు వరుసల రహదారులై
నక్షత్రాలను వీధి దీపాలుగా
నిలబెడుతోంది
నిత్యం శాంతిగీతాలతో
అన్ని దేశాల నిండా ప్రగతి
పాటకచేరీలు
ఎత్తి బిగించిన పిడికిళ్ళకు అడుగడుగున
కాలం చేసే సాష్టాంగ నమస్కారాలు
మానవత్వానికి మామిడాకులు కట్టిన
ఆ మరో ప్రపంచంలోకి ....
మనసును హారతులు చేసి
నేనూ అడుగులు వేస్తున్నాను ...

నా తలరాత గీతల మీద
కొత్త రాతలు రాస్తూ జయభేరి గీతాలు
మానవాళి మరోచరిత్ర కోసం
దారినిండా పరచిన
సమానత్వం తివాసీల మీద
నా అడుగులు, పరుగులయ్యాక
నా చేతి వ్రేళ్లను పిడికిళ్లుగా మారుస్తూ
భుజం తట్టిన శ్రీశ్రీ సంతకం!

– డా. కె.జి. వేణు
98480 70084



ఈ నెల 30న శ్రీశ్రీ జయంతి

లాల్ సలామ్!

తెల్ల కాగితం ఆకాశంపై
అక్షరాల పక్షుల్ని ఎగరేసిన ప్రతివాడు
కాలేడు కవి
ఆకలి మంటల కాక రవంతైనా అనుభవించి
ఉండాలి
ఉప్పని కన్నీటి రుచి కొంచెమైనా
చవిచూచి ఉండాలి
అవమానాల కొరడా
దెబ్బలకు మనసు చర్మం
కాస్తైనా రేగి ఉండాలి
అప్పుడు కదా! అంబ
పలికినట్లు కవిత్వం
పలుకుతుంది
ఒక్కొక్క అక్షరం ఒక్కొక్క
నిప్పులు జ్వాలై దహిస్తుంది
ఒక్కొక్క ఉప్పెనై కల్లోలం
సృష్టిస్తుంది
నిద్రపోతున్న జాతిని కుదుపు
కుదిపి
ఉలిక్కిపడేలా మేల్కొలుపుతుంది!

అదే అతని కవిత్వం
రెండక్షరాల పెనుమంట అతడు
రెండక్షరాల మహాకవి అతడు

• • •

ఎవరి మనసులోనైనా ఏముంటుంది
అవయవ సమాహారాలు
అందాల చిత్తరువులు
ప్రాణంలేని మనసు ఉనికిలేని మరబొమ్మలు
యవన సురభిళ శిల్పాలు
అప్పుడు కదా! మహాకవీ!
వీధిలో అడుక్కునే ముసలమ్మలో
కడుపు లుంగలు చుట్టుకుపోయే ఆకలినీ
పంటి బిగువున రాక్షసరతి బాధననుభవించే
పడుపుకత్తె వ్యధలను ఒడిసిపట్టింది
ఆ కలం

• • •

నిజంగా అనితర సాధ్యం నీ మార్గం
సంతకం అక్కర్లేని కవిత్వం
నీ సిద్ధాంతాలతో విభేదించే వారు సైతం
నీ కవితను విని తలయూచి పరవశించారు

• • •

సినిమా పాటలు రాసినా
సిరిసిరిమువ్వ శతకం రచించినా
నీ ముద్ర నీ ముద్రే
అశ్వాహృదయం తెలిసి
కనురెప్పపాటులో యోజనాల దూరం
మటుమాయం చేసే ఆశ్వికుడు నకులుడు
అక్షరాల పగ్గాలను చేతబట్టి
శబ్దాశ్వాలను ధాటిగా దీటుగా
నడిపించిన నేటి కవితా మాంత్రికుడవు
తెలుగు కవిత్వ జెండాను
విశ్వవీధుల్లో ఎగరేసిన ఘనాపాఠివి మేటివి
కవీ! నీ కవితా జలపాతం హోరులో
తడిసిపోతిని మురిసిపోతిని
దివ్య లోకాల తేలిపోతిని
కవీ! నీకు ఇదే నా లాల్ సలామ్!
లాల్ సలామ్!

– మందరపు హైమవతి
9441062732



ప్రాణం

పిల్లాడు
పాలు తాగుతున్నాడు
అప్పుడప్పుడు
చనుమధ్యరేఖలో
వేలు పెట్టి వృత్తాల్ గీస్తున్నాడు


లేత సూర్యకాంతి పెదాల నాడు
నేను అలానే తాగి ఉంటాను
చనుబాల జల్లులో తడిసే ఉంటాను

ఆ బతికిన క్షణాల్లో
మందారపూల రంగు పెదవులు
ఆకలైన ప్రతిసారీ పిట్టల్లా ఎగిరి
చనుకొమ్మల మీద వాలిపోయేవి
కాలం గడిచే కొద్దీ
నేను మగవాడ్ని అయిపోయి

సగాన్ని తక్కువగా చూడటమే
జీర్ణం కావడం లేదు
పాలు తాగే పసివాడి చెవుల దగ్గరకెళ్లి
'ఆమె నీకు పాలు కాదు
ప్రాణమిస్తోందని చెప్పాలని ఉంది.'

– డాక్టర్ సుంకర గోపాలయ్య
94926 38547

బాధిత బహుజన మహిళల బతుకు కథలు



సమీక్ష

ఎండుటాకుల మధ్య నుంచి పాకుతూ, నాగుపాము దూరమౌతున్న దృశ్యాన్ని ఎప్పుడైనా చూశారా? అప్పుడు పొందిన అనుభూతే ఈ కత్తి పద్మ కథలు 'చీకటి పువ్వు' చదివితే పొందుతాం. అవే గలగలలు, అదే ఆశ్చర్యం, ఒకొక్క కథా పూర్తయినంత వరకూ, నాగు కనుచూపు దాటినంతవరకూ నిశ్చేష్టంగా అదే దృష్టి. ఈ కథల్లో అబలలందరూ బహుజనులే! బహుజన మహిళలే ఈ సమాజంలో అసలైన శ్రామికులు. ఆహారాన్ని, అభివృద్ధిని వారే ఈ సమాజానికి హెచ్చుగా అందిస్తున్నారు. కళింగాంధ్రలో వైదికం ఎంత ప్రవేశించినా నేటికీ 95 శాతం బహుజనులే ఉంటారు. తూర్పు కాపులు, గొల్లలు, వెలమలు, కాళింగులూ, దళితులు, మత్స్యకారులూ, గిరిజనులూ ఇలా! ఒక కోమటి ఒక కాపు స్త్రీని, ఒక ఆచారి ఒక బ్రాహ్మణ మహిళ జీవితాన్ని నాశనం చేయడం తప్ప అగ్రవర్ణాలనుకొన్నవారు ఈ కథల్లో కనిపించరు. 'గురజాడ, కందుకూరి, శ్రీపాద బ్రాహ్మణ కులంలోని బాధలే రాశారు' అన్న వాక్యానికి అపవాదు ఈ కథలు. కాలం మారింది కదా!

తిరుగుబోతు మొగుళ్ళతో బాధలు పడ్డ స్త్రీలు, తాగుబోతు మగాళ్ళు చనిపోగా విధవలైనవారు, మొగుళ్ళు ఒదిలేస్తే ఒంటరైన మహిళలు, పురుషుల చేతిలో మోసగింపబడ్డ అబలలు ఇలా ఈగ్రంథం నిండా వీరే! కళింగాంధ్రలోని సమాజ బాధిత మహిళలే కనిపిస్తారు. ఈవిడ మామూలు కథకులు రాసినట్టుగా కథను ముగించరు. చిత్రకారుడు ప్రకృతిని చిత్రించి, పేరు మనల్నే పెట్టమన్నట్టు ముగింపు పాఠకుడికే వదిలేస్తారు. కథను మాత్రం ఏ కథకుడూ రాయలేనంత సహజంగా చెబుతారు. అడవి మధ్యగా వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న నది అడవి దట్టమైనచోట కనిపించకుండా పోతుంది. అది వేరే నదిలో లీనమయిందా? అక్కడే ఇంకి పోయిందా? ఇంకా పారుతుందా? సముద్రంలో కలిసి పోయిందా? పాఠకుడే అంచనా వేసుకోవాలి. ఈ కథల్లో ముగింపు కోసం వెతికితే నిరాశే! కాని ఆ రాసే విధానంలోని తెగింపు మాత్రం ఆశ్చర్యం.

'మనాడోల్లకి పెల్లిల్లు అచ్చిరావ్రా' అంటూ బిగ్గరగా ఏడుస్తుంది ఆదిలక్ష్మి 'మనకీ పెళ్ళిళ్ళు అచ్చిరావు' అనే కథ ముగింపులో. ఐతే ఈ కథలన్నింటిలో అన్ని పెళ్ళిళ్లూ పెద్దలు కుదిర్చినవే! ఏ సంసారమూ చివరంటా సజావుగా నడవదు. ఏ స్త్రీ జీవితం కూడా సంతోషంగా గడవదు. తల్లులే, ఇంట్లోని వారే అమ్మాయి ఇష్టాన్ని తెలుసుకోకుండా, డబ్బో, ఉద్యోగమో ఉందని తమకు నచ్చినవాడికిచ్చి చేసెయ్యడం, ఆ సంసారం పెటాకులైపోవడం, మగాడు వేరే స్త్రీని పెళ్ళాడ్డం, ఆడది సమాజానికి బలికావడం జరుగుతుంది. 'సమరమే!' అనే కథ ముగింపులో 'యుద్ధం తప్పనప్పుడు తలపడాల్సిందే! జీతం కోసమో, జీవితం కోసమో తెగించాల్సిందే! మళ్లీ మళ్లీ తెగించాల్సిందే! ... ఇలా బాధితురాలు పంతులమ్మచే అనిపిస్తారు.

ఇందులోని 19 కథల్లో బతుకు మీద యుద్ధంలో వీరమరణం పొందిన 'ఎర్రెమ్మ'లు పల్లెల్లో అక్కడక్కడా కనిపిస్తారు. పట్నం జనాలకు ఆమె ఓ వింత పాత్ర. ఛాత్రిబాబు (రావి శాస్త్రి) తన దగ్గరకు క్లైంట్లుగా వచ్చిన పేదల్లో కొందరు మహిళల జీవితాలను కథలుగా, నవలలుగా మలిచారు. కత్తి పద్మ నాల్గు దశాబ్దాలపాటు మహిళా ఉద్యమ కార్యకర్తగా తానే ఆయా పల్లెలకు పోయి, ప్రత్యక్షంగా చూచి, విని, బాధిత మహిళల జీవితాలను చలనచిత్రంలా రూపు కట్టించారు.

ఉత్తరాంధ్ర యాస ఈ పద్మ పట్టుకున్నంతగా ఇంకొక రచయిత పట్టుకోలేదంటే అతిశయోక్తి కాదు. పేరాలు పేరాలు, పేజీలు పేజీలు విశాఖపట్నం యాస అతి సహజంగా ప్రవహిస్తుంటుంది. ఈమె సమాజపు లోతుల్లోకి నడిచారు. మనల్ని నడిపిస్తారు ఈ కథల్లో. లోతులకు దిగితేనే ఏదైనా అంటుతుంది. 'నీగీదల్ని నీ ఇంట్లోనే ఉంచీసుకోయే. ఆటుచ్చా పేడా నీకే ఉండిపోతాయి. ఈదుల్లో ఒదలకే. నీగీద పేడని తెలిత్తే నా కోడలు దాని మొకవే సూడకపోను. పేడమీద గేదెల పేర్లూ లేవూ, నీ పేరూ నేదు. మరి అది ఎవలి పేడో ఎవులికి తెలుత్తాది. నువ్వు మనసులో ఏదో ఎట్టుకొని ఇలగ పేడమీద పేరెట్టి గొడవకి దిగినావని నాకు తెల్సుగానీ ఇంక ఎక్కువ పేలక. నా ఈదిలో పడిన పేడని మావు తీసి కుసింత కల్లాపి జల్లుకున్నాం. రాయే, వచ్చి మా వాకిలి నాకీసి పేడొట్టుకు పోయే.' ఈ రకంగా నూకాలమ్మను వరహాలమ్మ చేత ఒక దులుపు దులిపిస్తుంది కత్తి. 'మా ఇసాపట్నం కొండ' కథలోది ఈ సన్నివేశం. ఈ కథలో వరహాలమ్మ మొగుడు సత్తిరాజు పోర్టులో ఉద్యోగి. జీతమంతా తాగుడికే ఖర్చు చేస్తుంటాడు. తన వైవాహిక జీవితంలో ఏ రకమైన సుఖానికీ నోచుకోని వరాలమ్మ మొగుణ్ని వీథిలోకి గెంటేసి, పిల్లల్ని తానే పెంచి, గేదెలూ, కోళ్ళూ, కుక్కలే ఆప్తులుగా బతుకుతుంది.

ఇందులోని 19 కథల్లో మందుతాగి బలాదూరుగా తిరిగే మగవాళ్ళు మహిళలను ఆటవస్తువులగా వాడుకొని వదిలేయడం చూస్తాం. సమాజంలో మందు ఎంత బలంగా వేళ్ళూనుకుందో, స్త్రీల జీవితాలను ఎలా ఛిద్రం చేస్తోందో వీటిలో స్పష్టపడుతుంది. అన్నీ ఈ కర్మభూమి మీద నడయాడే ఆడదాని కథలే! రక్తమాంసాలు కలిగిన స్త్రీలు మన కళ్ళెదుటే తిరుగుతుంటారు. క్షోభలు, కన్నీళ్ళు, బండబారిపోడాలు, తెగింపులు ఒకటేమిటి? తరతరాలుగా సమాజం చేత తొక్కబడి, సమాజం అడుగు పొరలో మగ్గుతున్న అబలలే తారసపడతారు. 'దారులు మూసుకు పోవాల' కథంతా పూర్తయి, చివరి మూడు లైన్లు చదవగానే ఒకందుకు నవ్వొస్తుంది.

చీకటిపువ్వుగా బతికి విషాదాంతమైన కాంతది కథ కాదు. 50 ఏళ్ళ కిందటి కొందరి పేదింటి ఆడపిల్లల చరిత్ర. తన ప్రమేయం లేకుండానే తన శరీరం అంగడి వస్తువైన అబల వ్యథ ఇది. అంగడి సరుకైె బండబారి కూడా ఒక మగాడిని ఇష్టపడి, వాడికి జీవితాన్ని అర్పించిన కథే 'చీకటిపువ్వు'. మండే ఎడారిలోనూ ఒయాసిస్సు ఉంటుంది కదా! ఇందులో కాంత మనసూ అలాంటిదే! ముఖపత్రంపై చీకటిపువ్వును మోషే దయాన్ అత్యంత ప్రతిభావంతంగా వేశారు. పువ్వు ఏ తుమ్మెదకు తన మకరందాన్ని ఇష్టపూర్వకంగా అందిస్తుందో, ఏ తుమ్మెదను చూచి ముడుచుకు పోతుందో, చీదరించుకుంటుందో పూబోడులకే ఎఱుక. అందుచేతనే ఈ కథలను ఇంత ఆర్ద్రంగా కత్తి పద్మ రాయగలిగారు. మగవారికి అసాధ్యమైన రచన ఇది. వారు రాసినా కథలు కొంచం అటు ఇటు అవుతాయే తప్ప ఇంత స్వాభావికంగా రాయలేరు. 308 పుటల 'చీకటి పువ్వు' అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలోనూ రూ.250 లకు దొరుకుతుంది.

– గార రంగనాథం
98857 58123

బతికున్నప్పుడే ...

నువ్వు ఏం చెయ్యాలనుకుంటున్నావో
అది ఈ రోజే చెయ్యి
రేపు ఎప్పుడూ మనది కాకపోవొచ్చు
తప్పకుండా మనకు చెప్పకుండా
మన అనుమతి లేకుండా
మనను తీసుకుపోయే క్షణమొకటి వస్తుంది
అప్పుడు నువ్వెంత నొచ్చుకున్నా.. గింజుకున్నా
కాలధర్మంలో కలిసి పోవాల్సిందే!

రేపటి కోసం
ఈ రోజునే నీ తన్లాట చూస్తుంటే
మనిషి ఇంతేనేమోననిపిస్తుంది
కాస్త వాస్తవిక స్పృహలోకి రా ...

ద్వేషాలు మోసాలు ప్రతీకారాలు వీడు
వీలైనంత విశాలంగా ప్రేమించు
నువ్వు లేకున్నా నీ మాట.. నీ చేత
బతికే వుంటుంది తెలుసుకో...!

నిన్ను నువ్వు నిత్యం అప్డేట్ చేసుకోకుంటే...
ఆసాంతం వెనకబడతావ్
గిర్రున తిరుగుతున్న వర్తమాన పేజీల నుంచి
నిర్దాక్షిణ్యంగా నీ అస్తిత్వ వాక్యం తొలగించబడుతుంది!

నువ్వు నీ బాధల నడుమ
బందీ అయివున్నందుకు నిన్ను
అడుగడుగునా వేధించే వాళ్ళు
బాధించే వాళ్ళు కోకొల్లలుంటారు
అన్నీ లెక్క కట్టుకోకు తలలో మూట గట్టుకోకు
కదులు ముందుకు చైతన్యంతో ...
ఈ ఉరుకుల పరుగుల జీవితంలో
నువ్వెంత బిజీగా ఉన్నా సరే..
ఇరుగుతోనో... పొరుగుతోనో..
స్నేహితులతోనో.. సన్నిహితులతోనో..
రోజూ ఓ పిడికెడు ప్రేమను పోగేసుకో..

నువ్వు మదినిండా ఏడ్వటమైనా
హృది నిండా నవ్వటమైనా...
బతికున్నప్పుడే చెయ్యగలవ్
మంచో... చెడో.. కష్టమో...నిష్ఠూరమో...
నువ్విప్పటివరకూ
బతికున్నందుకు శుభాకాంక్షలు..!

– డా.కటుకోఝ్వల రమేష్
99490 83327

ఒక వలసపాఠం

ఆకలిబాధ అన్ని బాధలకీ
మూలకారణం అనే సూత్రాన్ని సూత్రీకరిస్తూ
ఖాళీ కడుపు చేత పట్టుకుని
ఖండంతరాలు దాటుకుంటూ
మారుతున్న కాలం ఛాయల్లోంచి
కొత్త అతిథి వస్తుంటుంది

నేలని సారవంతం చేస్తుంది
గాలిని ఆహ్లాద పరుస్తుంది
ప్రకృతిని రమణీయం చేస్తుంది
వాతావరణాన్ని పులకింపచేస్తుంది
తనంటే ఇష్టపడందెవరు
తనకోసం ఎదురు చూడందెవరు

తన వలన నేలకు మేలా
ఈ నేల వలన తనకి మేలా అనే తత్వాలను పాతరేసి
చూసినదంతా దోచుకుపోదామన్న
పరాయి బుద్ధినొదిలి
కనుచూపు మేరంతా నాదేనన్న ఆశనొదిలి
స్వచ్ఛమైన చిటికెడు స్నేహం కోసం
వెచ్చనైన బుక్కెడు బువ్వ కోసం
అరమరికలు లేని
ఆత్మీయతల్ని ఇచ్చిపుచ్చుకోవడం కోసమేనని
ఎప్పటికప్పుడు నిరూపిస్తుంటుంది
ఆమె.. ఒక వలస ప్రియురాలు !
పేరు ఫ్లెమింగో జవరాలు !

వస్తూ వస్తూ రెండుచేతులు చాచి
ఆత్మీయ ఆలింగనం కోసం వస్తుందా
పోతూ పోతూ రెండు రెక్కలల్లారుస్తూ
ఏమీ తీసుకుపోవట్లేదు
తన శరీరాన్ని చీల్చుకొచ్చిన పిల్లల్ని మినహా
అంటూ ఒక బహిరంగ ప్రకటన చేస్తుంది

అనుకోటానికి తను ఒక వలసపక్షే
వచ్చీపోతున్న ప్రతిసారీ
బతుకంటే ఎడతెగని పోరాటమని
గొప్ప పాఠాన్ని చెప్పిపోతుంటుంది
మనిషిచ్చే కాలుష్యమనే బహుమానం
బతుక్కద్దుకుంటూ..!

(ఇంటర్నేషనల్ ఫ్లెమింగో డే ఏప్రిల్ 26ను పురస్కరించుకుని)

– బంగార్రాజు కంఠ
8500350464

డాక్టర్ రాధేయ కవితా పురస్కారం 2023

ఒక తడి అనేక సందర్భాలు, తూనీగతో సాయంకాలం, నూర్జహాన్ కు ప్రేమలేఖ అనే మూడు కవితా సంపుటాల ద్వారా తెలుగు కవితా లోకంలో విలక్షణ కవిగా పేరుపొందిన కవి, పద చిత్రాల పదనిసలతో కవిత్వానికి అపూర్వ పరిమళాలు అద్దుతున్న కవి అయిన తెలుగు వెంకటేష్ (99853 25362) గారిని డాక్టర్ రాధేయ కవితా పురస్కారం 2023 కోసం ఎంపిక చేశాం. ఈ అవార్డులో 5000 నగదుతో పాటు ఘన సన్మానం ఉంటుంది. పురస్కార ప్రదాన తేదీ, వేదికను తరువాత తెలియజేస్తాం.

– డా.పెళ్లూరు సునీల్, డా.సుంకర గోపాలయ్య, దోర్నాదుల సిద్ధార్థ
డాక్టర్ రాధేయ కవితా పురస్కార వ్యవస్థాపకులు

అంతర్జాతీయ అంతర్జాల శతక పద్య పోటీలు

'పద్యానికి పట్టాభిషేకం' తేజోమయం – తెలుగు పద్యం శీర్షికన తెలుగు భాష దినోత్సవాన్ని పురస్కరించుకొని పద్యపోటీలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ కార్యక్రమానికి లభించిన అపూర్వ స్పందన నేపథ్యంలో మరొకసారి పద్య పఠనపు పోటీలను నిర్వహించాలని తలపెట్టింది శ్రీ వాగ్దేవి కళాపీఠం. ఈ పోటీల్లో పాల్గొనడానికి దరఖాస్తు చేయడానికి ఆఖరు తేదీ 30 ఏప్రిల్. ఈ పోటీల్లో ప్రపంచంలో ఎక్కడ నివసించేవారైనా పాల్గొనవచ్చు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఎలాంటి ప్రవేశ రుసుము లేదు. ఎటువంటి వయోపరిమితి లేదు .పూర్తి వివరాలకు 93913 56105 చరవాణిలో సంప్రదించగలరు.

– వి. వి. ఎల్ .శ్రీనివాస మూర్తి, శ్రీ వాగ్దేవి కళాపీఠం

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, తాడేపల్లి, అరవిందా స్కూలు దగ్గర, గుంటూరు జిల్లా..
prajasavvadi@gmail.com

వర్తమాన భారతదేశ కథలు 'సిక్స్ ప్యాక్ రాముడు'



పుస్తకం

రాజకీయ అంశాలు కథల్లో అంత సులభంగా ఇమడవు. దానికి ఎంతో పరిణితి అవసరం. కథా లక్షణాలు దెబ్బతినకుండా, కథ కాస్తా వార్తాకథనంలా మారకుండా తగిన జాగ్రత్తలతో రచయిత కథని మలచాల్సి ఉంటుంది. ఈ పనిని చాలామంది యువ కథకులు చేయబోయి చేతులు కాల్చుకున్నారు. కానీ 'సిక్స్ ప్యాక్ రాముడు' – కథల పుస్తకం వేసిన పావనిలో ఆ తడబాటు ఎక్కడా కనబడదు. చెప్పదల్చుకున్న విషయాన్ని సూటిగా తనదైన ఎత్తుగడతో వివరించి వదిలేస్తుంది. ఏదో వ్యాసం చదువుతున్నట్టు కాకుండా కథలో భాగంగానే అనేక వర్తమాన రాజకీయ అంశాలను చర్చకు పెడుతుంది.

నిజానికి విప్లవ, అభ్యుదయ భావజాలం ఉన్న రచయితల్లో కొందరు ఈ పనిని ఇది వరకే విజయవంతంగా చేసి చూపించారు. ఆ కోవలోనే పయనిస్తున్న యువ రచయిత్రి పావని గత దశాబ్ద కాలంలో దేశంలో జరుగుతున్న అనేక పరిణామాలను ఈ కథల్లో చర్చిస్తుంది. మతం, దేశభక్తి, స్వాభిమానం పేరుతో జరుగుతున్న రాజకీయం, పెట్టుబడి వెనుక ఎవరి ప్రయోజనాలు దాగున్నాయో స్పష్టంగా చెబుతుంది.

రష్యా విప్లవ నేత లెనిన్ చెప్పినట్టు 'ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోనంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారు'. చాలాచోట్ల పాలకులు ప్రజలను ప్రశాంతంగా ఉండనివ్వరు. వారిలో ఎప్పుడూ ఏదో ఒక అశాంతిని రగిలిస్తూ ఉంటారు. ప్రశాంతంగా ఉన్న ప్రజలు అభివృద్ధి గురించి, హక్కుల గురించి, అన్యాయాల గురించి అక్రమ వ్యాపారాల గురించి అడుగుతారు. అందుకే వారిలో ఎప్పుడూ కృత్రిమంగా ఏదో ఒక భావోద్వేగాన్ని రగిలించడం వారికి నిత్యావసరం. ఇక్కడే పావనిలాంటి యువ రచయిత్రుల అవసరం మనకు ఉంది. ఇలాంటి వారు ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనం ఉందో తమ కలం కన్నుతో పసిగట్టి తమకు నచ్చిన కళారూపాల్లో ప్రజలకు చెబుతారు. ఆ విషయంలో పావని విజయవంతం అయింది.

పావని తన కథల పుస్తకానికి 'సిక్స్ ప్యాక్ రాముడు' అనే పేరు పెట్టడంలోనే ఎంతో వైవిధ్యం చూపించింది. అసలు ఆ పేరులోనే ఎంతో వర్తమానం ఉంది. ఒకప్పుడు దేవుళ్లంటే దయామయులు, కరుణ రసం ఉన్నవాళ్లు. కులమతాలకు అతీతంగా అడిగినవాళ్లందరికీ కాదనకుండా వరాలిచ్చేవాళ్లు. ఇప్పుడలా కాదు. ఇప్పుడు దేవుళ్లు కోపంతో రగిలిపోతున్నారు. కండలు పెంచుతున్నారు. కళ్లల్లో రౌద్రం పండిస్తున్నారు. ఆ ఆకారాలతో ఒక వర్గం ప్రజల్లో అభద్రతను పెంచుతున్నారు.

చివరికి చిన్న పిల్లలను సైతం వదలకుండా వారిని ఆట పాటలతో మచ్చిక చేసుకుని తర్వాత తిన్నగా వారి హృదయాల్లో విషం చిమ్ముతున్న తీరును టైటిల్ కథలో చెబుతుంది పావని.

పావని రాయలసీమ నుంచి వచ్చిన రచయిత్రి. ఆమె కథల్లో ఆ ప్రాంత మాండలికం, సామరస్యం కనబడుతుంది. కడప సూఫీ సాధువు హజ్రత్ అలీ పేరు మీద హజ్రత్ అని పేరు పెట్టుకున్న ఒక వ్యక్తిని ఒక మతోన్మాద మూక చంపేస్తుంది (భక్తి మార్గం). మతం గుడ్డిది, తమ మతం ఎవరిదో పరమతం ఎవరిదో గుర్తించలేనంత అంధకారమైంది. అందుకే దాని చేతికి పగ్గాలు ఇస్తే ఫలితాలు ఇలాగే ఉంటాయని వివరించి చెబుతుంది రచయిత్రి.

ఒక ఆవు వీధిలో అదుపు తప్పుతుంది (ఆవు ఆత్మహత్య). ఒకరిద్దరి మీద దాడి చేస్తుంది. ఇక దాన్ని అదుపు చేయడానికి వీధిలో ఎవరికీ గుండెలు చాలవు. అదే కుక్కయితే ఈపాటికి చంపేసేవాళ్లు, పులి అయితే తరిమేసేవాళ్లు, ఏనుగు అయినా సరే బంధించే వాళ్లు.. కానీ అది ఆవు.. రాజకీయ అంశంగా మారిన ఆవు. అది తిరగబడి జనాల్ని చంపేస్తున్నా దాన్నేమీ అనకూడదు. ఈ కథను బోల్డంత వ్యంగ్యంతో ప్రతీకాత్మకంగా చెప్పి మెప్పిస్తుంది రచయిత్రి. ఈ మధ్య ప్రేమికుల రోజు నాడు 'కౌ హగ్ డే' కోసం పిలుపునిచ్చి ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన పాలకులు గుర్తొస్తారు ఈ కథ చదివితే.

నలుపు, తెలుపు వర్ణాల పేరుతో జరుగుతున్న రాజకీయం, వ్యాపారం మీద కూడా పట్టింపు ఉంది రచయిత్రికి. నల్లగా ఉన్న తనను అందరూ శూర్పనఖ (నా పేరు శూర్పనఖ) అంటుంటే బాధపడుతుంది కథలోని ప్రధాన పాత్ర. తర్వాత అదే పాత్ర చివర్లో తనను శూర్పనఖ అన్నందుకు ఆనందపడుతుంది. సంతృప్తి చెందుతుంది. ఇక ముందు తాను శూర్పనఖగానే గుర్తింపు పొందాలని కోరుకుంటుంది. ఈ మధ్యలో ఏం జరిగిందనేదే కథ.

అయోధ్యలో రామమందిరం కోసం ఇటుకలు తయారు చేస్తుంది ఒక పాత్ర (గోడలు). తీర్థయాత్రలు చేసి పరమతానికి చెందిన స్నేహితుణ్ని దూరంగా పెడుతుంది. తర్వాత రాజకీయం తెలుసుకుని పశ్చాత్తాపంతో ఇలా అంటుంది – 'ఇటుకలు గుడి కట్టేందుకు కాదు; జనం మధ్య గోడలు కట్టేందుకు.. చివరికి నీకూ నాకూ మధ్య కూడా, వాళ్లు ఎప్పటికీ గోడలు కట్టలేరు, ఎందుకంటే జనం మధ్య గోడలు కట్టడానికి వారికి ఇటుకలు సరిపోవు'. చాలా ఆశావాద దృక్పథంతో ముగుస్తుంది ఈ కథ.

ముందే చెప్పినట్టు ఈ పుస్తకం చదువుతున్నంతసేపు మనకు వర్తమాన భారతం కళ్లకు కడుతుంది. పైకి సామాన్యంగా కనిపించే అనేక విషయాల వెనుక అసలు కథేంటో తెలిసి మనకు కళ్లు తెరుచుకుంటాయి. ఏ కథాసాహిత్యానికైనా ఇంతకుమించిన సామాజిక ప్రయోజనం మరేముంటుంది? తొలి పుస్తకమే అయినా గురి తప్పకుండా విషయం చెప్పే సత్తా ఉందని చాటిన ఈ రచయిత్రి నుంచి మరిన్ని మంచి కథలను ఆశించవచ్చు. **(సిక్స్ ప్యాక్ రాముడు (కథలు), రచయిత్రి: పావని, ప్రచురణ: విరసం, ధర : రూ.120, ప్రతులకు : అన్ని పుస్తక కేంద్రాలు.)**

– డా. వేంపల్లె షరీఫ్
9603429366

నోరు మెదపరేం..?

- ఆ ప్రశ్నలకు జవాబేది ?
- ప్రశ్నిస్తే ఎదురుదాడేనా?
- పుల్వామాపై నేటికీ పెదవి విప్పని మోడీ ప్రభుత్వం

జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరిలో జరిగిన ఉగ్రవాద దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. అమర వీరులకు దేశమంతా ఘనంగా నివాళులు అర్పించింది. పుల్వామాలో జరిగిన ఈ దారుణానికి కారణమెవరు ? సీఆర్‌పీఎఫ్ జవాన్లను కాపాడుకోవడంలో ఎందుకు విఫలమయ్యాం? వంటి ప్రశ్నలు ఆనాడే తలెత్తాయి. అయినా వీటికి పాలకులు సరైన సమాధానం ఇవ్వలేదు. ఈ ఘటన జరిగి నాలుగు సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఆ ప్రశ్నలకు జవాబులు లేవు. మౌనమే బీజేపీ ప్రభుత్వ సమాధానం అవుతోంది.



న్యూఢిల్లీ : పుల్వామా ఘటన జరిగిన సమయంలో జమ్మూకాశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన సత్యపాల్ మాలిక్ ఇప్పుడు ఆ తేనెతుట్టెను మళ్లీ కదిలించారు. ఆయన లేవనెత్తిన అంశాలు దేశ భద్రత, ప్రభుత్వ సమర్థతకు సంబంధించి అనేక తీవ్రమైన ప్రశ్నలను జాతి ముందు ఉంచాయి. అయినప్పటికీ ప్రభుత్వం అప్పటి మాదిరిగానే ఇప్పుడూ మౌనాన్ని ఆశ్రయించడం దేశ ప్రజలను ఆందోళనకు, కలవరపాటుకు గురిచేస్తోంది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ అంశంపై ఎలక్ట్రానిక్ మీడియా కూడా నోరు విప్పకపోవడం మరింత ఆందోళన కలిగించే విషయం. పుల్వామా ఘటనను ఏ విధంగా నివారించి ఉండేవారమో సత్యపాల్ మాలిక్ స్పష్టంగా చెప్పారు. సైనికుల భద్రతను ఫణంగా పెట్టి ఉండకపోతే ఈ సంఘటన జరిగి ఉండేదే కాదని ఆయన కుండబద్దలు కొట్టారు. ఉగ్రవాద కార్యకలాపాలు అధికంగా కన్పించే ప్రాంతంలో...మనుష్య సంచారం లేని రోడ్డు మీద...సైనిక వాహనాలు పెద్ద సంఖ్యలో ప్రయాణించడాన్ని ఆయన తప్పుపట్టారు. జవాన్ల కోరిక మేరకు వారిని విమానాలలో తరలించి ఉంటే ఈ ముప్పు జరిగేదే కాదని సత్యపాల్ చెప్పారు. ఆయన చెప్పిందే నిజమైతే తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్రం చేసిన ప్రయత్నాలు, సైనికుల భద్రత విషయంలో దాని అలసత్వం తేటతెల్లమవుతున్నాయి.

పుల్వామా ఘటనలో కేంద్రం వైఫల్యాన్ని సత్యపాల్ మాలిక్ ఎండగట్టగానే బీజేపీ నాయకులంతా ఆయనపై ముప్పేట దాడి మొదలు పెట్టారు. ఆయన విశ్వసనీయతను ప్రశ్నించారు. అంతేకానీ ఆయన చెప్పింది అవాస్తవమని అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. లేదా పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసి ఆయన లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలూ ఇవ్వలేదు. అవి సత్యపాల్ వేసిన ప్రశ్నలు మాత్రమే కాదు... దేశంలోని ప్రతి పౌరుడు సంధించిన ప్రశ్నలు. అయినప్పటికీ దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన ప్రశ్నలకు కేంద్రం సమాధానం ఇవ్వలేదు. చెవిటివాని ముందు శంఖం ఊదిన చందంగా వ్యవహరించింది. 'నోరు విప్పవద్దు' అంటూ ఆనాడు సత్యపాల్‌కు ప్రధాని మోడీ హుకుం జారీ చేశారు. ఇప్పుడు దేశంలో లోపించిన పారదర్శకత విషయంలో ప్రశ్నించినా కేంద్రం అదే మాట చెబుతోంది. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ వైఫల్యంపై మాట్లాడకుండా సత్యపాల్ నోరు మూయించేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించడాన్ని చూస్తుంటే అసలు ఆ విషయాలకు అది ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నది అర్థమవుతుంది. ఎన్నికలలో విజయం సాధించడం ఒక్కటే దాని లక్ష్యం. నెపాన్ని గవర్నర్ పైన నెట్టి, జవాబుదారీతనం నుంచి తప్పించుకునేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేసింది.

పారదర్శకత, జవాబుదారీతనం అనేవి ప్రజాస్వామ్యంలో అత్యంత ఆవశ్యకమైన విషయాలు. ప్రభుత్వం నుంచి ప్రజలకు సమాచారం లభించకపోవడం ప్రజాస్వామ్య వైఫల్యంగానే భావించాలి. కొన్ని విషయాలలో గోప్యత అవసరమే అయినప్పటికీ సాయుధ దళాల రక్షణలో ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చడం సరికాదు. పాలనలో పారదర్శకత ఉండాలన్నా, ప్రజలకు అవసరమైన సమాచారం లభించాలన్నా పార్లమెంట్ అనేది చాలా కీలకం. కానీ దురదృష్టవశాత్తూ రక్షణ, భద్రతకు సంబంధించి ఎంపీలు ఎంతగా అరచి గీపెట్టినా పాలకులు పెడచెవిన పెడుతున్నారు. పుల్వామా ఘటనపై విచారణ జరిపించాలని ఎంపీలు డిమాండ్ చేసినప్పటికీ ఈ వ్యవహారం దర్యాప్తులో ఉన్నదని చెబుతూ సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిరాకరించింది. ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఈ దాడిపై ఇప్పటివరకూ సవివరమైన నివేదిక ఏదీ బయటకు రాలేదు. విచారణ ఎంత వరకూ వచ్చిందో కూడా తెలియడం లేదు.

పుల్వామా దుర్ఘటన జరిగి నాలుగేండ్లు దాటినా ఆ హృదయవిదారకమైన దృశ్యాలు నేటికీ కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. ఈ ఘటనలో తన ప్రమేయం ఏమిటో బయటపెట్టేందుకు మోడీ ప్రభుత్వం విముఖత వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వ రక్షణ లేకుండా రెండున్నర వేల మంది సైనికులు ఆ రోడ్డు మీదుగా ఎందుకు ప్రయాణించారు? ఉగ్రవాద దాడి జరుగుతుందని ప్రభుత్వానికి ముందస్తు సమాచారం ఏమైనా ఉన్నదా? సైనికులను విమానాల ద్వారా తరలించేందుకు ఎందుకు నిరాకరించారు? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ఎన్నికైన ప్రజా ప్రభుత్వానికి లేదా? వాస్తవాన్ని చెప్పేందుకు నిరాకరించడం అంటే ప్రజాస్వామ్య సూత్రాలను నీరుకార్చడమే అవుతుంది.

ఏక్‌నాథ్ ప్రభుత్వం పక్షం రోజుల్లో కూలిపోతుంది !

- సంజయ్ రౌత్ వ్యాఖ్య



ముంబయి : మహారాష్ట్రలో బిజెపి కుట్రలతో తిరుగుబాటు లేవదీసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఏక్‌నాథ్ షిండే సర్కార్‌కు రోజులు దగ్గరపడ్డాయని శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. రాబోయే 15 లేదా 20 రోజుల్లో ఏక్‌నాథ్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. శివసేన రెబల్ ఎమ్మెల్యేలు బిజెపితో కలిసి ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ఇప్పటికే డెత్ వారంట్ జారీ అయ్యిందని చెప్పారు. రాజ్యసభ సభ్యులు కూడా అయిన సంజయ్ రౌత్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఉద్ధవ్ థాకరే నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన షిండే ముఠాకు చెందిన 16 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌తో సహా పలు పిటిషన్లపై తీర్పులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ తీర్పు కోసం తాము ఎదురుచూస్తున్నామని, న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. 'ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి (ఏక్‌నాథ్ షిండే) ఆయన 40 మంది ఎమ్మెల్యేల ప్రభుత్వం 15-20 రోజుల్లో కూలిపోతుంది. ఈ ప్రభుత్వానికి డెత్ వారెంట్ జారీ అయ్యింది. దానిపై ఎవరు సంతకం చేస్తారనేది నిర్ణయించాల్సి ఉంది' అని సంజయ్ రౌత్ అన్నారు.

గతేడాది జూన్‌లో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో 39 మంది శివసేన ఎమ్మెల్యేలు ఆ పార్టీపై తిరుగుబాటు చేశారు. దీంతో సిఎం పదవికి ఉద్ధవ్ థాకరే రాజీనామా చేయడంతో.. శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ భాగస్వామ్యంగా ఉన్న మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం ఏక్‌నాథ్ షిండే బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.



నారేమద్దిపల్లిలో డబ్బుల హుండీని పిల్లలతో కలిసి అందజేస్తున్న ఫాహిమా బాను

బూర్జువా పార్టీలకు వామపక్షాలకు ఇదీ తేడా !


బాగేపల్లి : ఓట్ల కోసం నోట్లు ఎరగా వేసే బూర్జువా పార్టీలకు ..నిరంతరం ప్రజల పక్షాన పోరాడే వామపక్షాలకు తేడా ఏమిటో తెలియజేసే చిత్రమిది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బాగేపల్లి స్థానం నుంచి సిపిఎం తరుపున పోటీ చేస్తున్న ప్రజా వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్‌కు ఎన్నికల ప్రచారానికి అవసరమైన డబ్బును ప్రజలే సమకూర్చుతున్నారు. బాగేపల్లి సమీపంలోని నారేమద్దిపల్లిలో ఆదివారం నాడు సిపిఎం కార్యకర్తలు ప్రచారం నిర్వహిస్తుండగా ఒక మైనార్టీ కుటుంబం ఎదురొచ్చి విరాళం అందజేసింది. ఫాహిమా బాను అనే మహిళ తన చిన్నారులు నజియా, గజియాతో కలిసి వచ్చి వారు డబ్బులు దాచుకున్న హుండీని డాక్టర్ అనిల్ కుమార్‌కు అందజేశారు. ప్రజా ఉద్యమాలకు ఓటుతో పాటు నోటు రూపంలోనూ అండగా ఉంటామని చాటి చెప్పారు.

ఇడి అధికారులకు ఆప్ ఎంపి నోటీసులు

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కేసులో తనపై అవమానకరమైన తప్పుడు ఆరోపణలు చేసినందుకు 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారులకు ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపి సంజయ్ సింగ్ శనివారం నోటీసులు పంపారు. క్షమాపణలు చెప్పకపోతే సివిల్, క్రిమినల్ పరువు నష్టం కేసులను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇడి డైరెక్టర్ సంజయ్ కుమార్ మిశ్రా, అదనపు డైరెక్టర్ జోగేందర్‌లకు ఈ నోటీసులు పంపారు. ఢిల్లీ మద్యం కేసుతో తనకు సంబంధం ఉన్నట్లు ఉద్దేశపూర్వకంగానే అవాస్తవ, పరువు నష్టం ఆరోపణలు చేశారని విమర్శించారు. ఇందుకు బాధ్యులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇడిని దుర్వినియోగం చేస్తోందంటూ పార్లమెంటులో తాను గళమెత్తిన కొన్ని రోజుల వ్యవధిలోనే ఇడి ఛార్జిషీట్‌లో తన పేరు చేర్చారని పేర్కొన్నారు.

ఇండోనేషియాలో వరుస భూకంపాలు

ఇండోనేషియా : ఇండోనేషియాను ఆదివారం తెల్లవారుజామున రెండు భూకంపాలు కుదిపేశాయి. తొలి భూకంపం కేపులాన్ బటులో 6.1 తీవ్రతతో సంభవించగా, ఆ తర్వాత గంటల వ్యవధిలోనే 5.8 తీవ్రతతో మరో భూకంపం సంభవించినట్లు యూరోపియన్ మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ (ఈఎంఎస్‌సీ) తెలిపింది. తొలి భూకంపం భూమికి 43 కిలోమీటర్ల లోతున, రెండోది 40 కిలోమీటర్ల లోతున సంభవించినట్లు పేర్కొంది. అయితే, ఈ భూకంపాల వల్ల జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.



రహస్యాలను దొంగిలించడంలో ప్రపంచ నెంబర్‌వన్ అమెరికా

బీజింగ్ : ఇతర దేశాల రహస్యాలను దొంగిలించడంలో ప్రపంచ నెంబర్ వన్‌గా అమెరికా నిలిచిందని ఈజిప్టుకు చెందిన డైలీ న్యూస్ పేర్కొంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన పెంటగాన్ పత్రాలే ఇందుకు తిరుగులేని తార్కాణమని ఆ పత్రిక వ్యాఖ్యానించింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎగదోస్తున్న అమెరికా తన మిత్ర దేశాలపైనా నిఘా పెడుతోంది. అమెరికాకు ఇదేమీ కొత్త కాదు, ఇతర దేశాల రహస్యాలను దొంగిలించడం, టెలిఫోన్ సంభాషణలను రహస్యంగా వినడం వంటి చట్ట విరుద్ధమైన, నీతి బాహ్యమైన పనులను అమెరికా ఎప్పటి నుంచో కొనసాగిస్తున్నది. . ప్రపంచ వ్యాపితంగా వివిధ దేశాల రహస్యాలను దొంగిలించడమే గాక, ఇంటర్నెట్ వినియోగదారుల వ్యక్తిగత గోప్యత హక్కును కూడా అది హరించివేస్తున్నదని డైలీ న్యూస్ పేర్కొంది. సైబర్ దాడులు, ఫోన్ ట్యాపింగ్‌లు లేకపోతే అమెరికాకు నిద్దర పట్టదు. జాతీయ భద్రత పేరుతో అమెరికా సాగిస్తున్న ఈ చర్యలు ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తాయని పేర్కొంది. 'గ్లోబల్ సర్వైలెన్స్ సూపర్ పవర్'గా పేరుమోసిన అగ్రరాజ్యం ఆధిపత్య, బెదిరింపు ధోరణికి కళ్లెం వేయాలి. ప్రపంచ దేశాలపై విచక్షణా రహితంగా, దీర్ఘకాలంగా అనుసరిస్తున్న ఈ తుచ్ఛమైన పనులకు స్వస్తి పలికి, ప్రపంచ న్యాయాన్ని పునరుద్ధరించాలని డైలీ న్యూస్ సూచించింది.

కేసుల ఉపసంహరణలో కర్ణాటక 'ఉదారత్వం'

- నాలుగేండ్లలో 385 క్రిమినల్ కేసులకు ఉపసంహరణ
- వెయ్యి మంది నేరస్థులకు లబ్ధి

బెంగళూరు : కర్ణాటకలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న బిజెపి పభుత్వం క్రిమినల్ కేసుల ఉపసంహరణ విషయంలో ఎంతో 'ఉదారత్వాన్ని' ప్రదర్శించింది. 2019 జూలై నుంచి ఈ సంవత్సరం ఏప్రిల్ వరకూ మొత్తం 385 క్రిమినల్ కేసులను ఉపసంహరించుకుంది. వీటిలో 182 కేసులు విద్వేషపూరిత ప్రసంగాలకు, గో సంరక్షణ పేరిట జరిగిన హింసకు, మతపరమైన హింసాకాండకు సంబంధించినవి. ప్రభుత్వ నిర్ణయం కారణంగా వెయ్యి మంది నేరస్థులు ప్రయోజనం పొందారు. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ఆర్‌టీఐ ద్వారా రాష్ట్ర హోం శాఖ నుంచి ఈ సమాచారాన్ని పొందింది. క్రిమినల్ కేసులలో విచారణను నిలిపివేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం 2020 ఫిబ్రవరి, ఈ సంవత్సరం ఫిబ్రవరి మధ్యకాలంలో ఏడుసార్లు ఆదేశాలు జారీ చేసింది. 2020 ఫిబ్రవరిలో మొదటిసారి జారీ చేసిన ఆదేశాలలో రైతుల నిరసనలకు సంబంధించి నమోదైన కేసులను ఉపసంహరించారు. మిగిలిన ఆరు ఆదేశాలలోనూ సగం మతహింసకు చెందినవే. వీటి ద్వారా ప్రయోజనం పొందిన వారిలో ఓ బిజెపి ఎంపీ, మరో బిజెపి ఎమ్మెల్యే ఉన్నారు. 2020 ఫిబ్రవరి-ఆగస్ట్ నెలల మధ్య ఉపసంహరించుకున్న కేసుల కారణంగా మైసూర్ బిజెపి ఎంపీ ప్రతాప్ సింహ, బిజెపి ఎమ్మెల్యే రేణుకాచార్య సహా పలువురు ప్రజాప్రతినిధులు బయటపడ్డారు.

మతహింసకు సంబంధించిన 182 కేసులలోనూ 45 కేసులు ఉత్తర కన్నడ జిల్లాలో 2017 డిసెంబరులో జరిగినవి. ఈ కేసులలో 200 మందిపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. టిప్పు సుల్తాన్ జయంతి, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, వినాయక చవితి పండుగలకు సంబంధించిన కేసులు కూడా వీటిలో ఉన్నాయి. ఉపసంహరించుకోవడానికి అనువైనవి కావంటూ ప్రాసిక్యూషన్, న్యాయ మంత్రిత్వ శాఖ అభ్యంతరం చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం అక్టోబర్‌లో 34 కేసులు వెనక్కి తీసుకుంది.

హిందూ జాగరణ వేదిక, శ్రీరామసేన నాయకులపై నమోదైన కేసులను కూడా ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అనేక కేసులు న్యాయస్థానాల్లో పదేండ్లకు పైగా అపరిష్కృతంగా ఉన్నాయని, అందుకే వీటిని ఉపసంహరించుకున్నామని హోం మంత్రి జ్ఞానేంద్ర తెలిపారు. జనవరి 2020, 2023 మధ్య నమోదైన 105 విద్వేషపూరిత ప్రసంగాల కేసుల్లో 55 కేసులో ఒక్క బెంగళూరు నగరంలో నమోదైనవే.



రాహుల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బసవేశ్వర పీఠాధిపతి

బసవేశ్వర జయంతి వేడుకల్లో రాహుల్

- కాంగ్రెస్‌లో హుషార్

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార హోరు కొనసాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత, వేనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ రెండు రోజుల పర్యటన నిమిత్తం తరలిరావడంతో కాంగ్రెస్‌లో జోష్ పెరిగింది. ఆదివారం ఉదయం హుబ్లీ విమానాశ్రయం చేరుకున్న ఆయనకు మాజీ ముఖ్యమంత్రి, ఇటీవల బిజెపి వీడి కాంగ్రెస్‌లో చేరిన జగదీశ్ శెట్టార్ ఘన స్వాగతం పలికారు. అనంతరం కుడాల సంగమలో బసవన్న జయంతి సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో రాహుల్ పాల్గొన్నారు. చారిత్రక సంగమనాథ ఆలయాన్ని సందర్శించారు. తర్వాత బసవన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ బసవన్న కూడా ఎన్నో బెదిరింపులను ఎదుర్కొన్నారని, కానీ ఆయన ఏనాడూ సత్యమార్గాన్ని వీడలేదని చెప్పారు. ప్రజాస్వామ్య భావనకు మన దేశంలోనే కాకుండా ప్రపంచానికే ఆయనొక మార్గాన్ని చూపారని, దీనిని ఎవరూ నాశనం చేయలేరని రాహుల్ అన్నారు. గురు బసవన్న ప్రజాస్వామ్యం గురించి, కులతత్వం గురించి, గౌరవం గురించి తనను తానే ప్రశ్నలు సంధించుకొని పరిష్కారాలు సాధించారని, ఆయన అనుసరించిన మార్గాన్ని అనుసరిస్తేనే చీకటి నుంచి మన జీవితాలు వెలుగుబాట పడతాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, తదితరులు ఆయనతో పాటు పాల్గొన్నారు.

విజయపురలో రోడ్ షో

అనంతరం ఆయన విజయపురలో భారీ రోడ్ షో నిర్వహించారు. రోడ్డు ఇరువైపులా వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు జెండాలు ఊపుతూ ఆయనకు స్వాగతం పలికారు. 'రాహుల్..రాహుల్..' అంటూ నినదించారు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాహనంలో రాహుల్ ప్రజలకు అభివాదం చేస్తూ వెళ్లారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆయన రోడ్ షో ప్రారంభించారు. శివాజీ సర్కిల్ నుంచి కనకదాస సర్కిల్ వరకూ వీధుల గూండా రాహుల్ రోడ్ షో సాగింది. కర్ణాటక కాంగ్రెస్ ప్రచార కమిటీ ఛీఫ్ ఎంబి పాటిల్, తదితర అగ్ర నాయకులు రాహుల్‌తో పాటు రోడ్ షోలో పాల్గొన్నారు. కాగా బిజెపి వీడి ఇటీవల కాంగ్రెస్ చేరిన మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టార్..రాహుల్‌తో ఏకాంతంగా సమావేశమయ్యారు. ఎన్నికల వ్యూహాలపై ఇరువురు చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని, బిజెపిలో అవమానాలు భరించలేకనే తాను కాంగ్రెస్‌లో చేరానని ఈ సందర్భంగా రాహుల్‌తో శెట్టార్ పేర్కొన్నట్లు తెలిసింది.



కర్ణాటక బరిలో రామక్క

- థర్డ్ జెండర్ నుంచి ఒకే ఒక్కరు
- హక్కుల కోసమే పోరాటం



బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి జిల్లా కంప్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న టి రామక్క (59) అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఈ ఎన్నికల బరిలో నిలిచిన ఏకైక థర్డ్ జెండర్ రామక్క కావడమే అందుకు కారణం. దేశ్ ప్రేమ్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. బళ్లారి జిల్లా కురుగోడ్ తాలుకా బడనహట్టి గ్రామానికి రామక్క ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ప్రత్యేకించి ట్రాన్స్‌జెండర్లపై వివక్ష కొనసాగుతోందని, ఈ సామాజిక రుగ్మతపై పోరాటంలో భాగంగానే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. జోగతి నృత్యకారిణిగా పని చేస్తున్న రామక్క..పది మంది సాంప్రదాయ జోగతి నృత్యకారులతో ఒక బృందాన్ని నడిపిస్తున్నారు. వివిధ ప్రయివేటు, ప్రభుత్వ కార్యాక్రమాల్లో నృత్యాలు ప్రదర్శించి ఈ బృందం బతుకెళ్లదీస్తుంటుంది. ఒక ప్రదర్శనకు రూ.15 వేలు - రూ.20 వేలు వరకు వస్తుంటాయని, ఆ మొత్తాన్ని బృంద సభ్యులు సమానంగా పంచుకుంటామని రామక్క తెలిపారు. రామక్క తనతో పాటు 107 ఏళ్ల తల్లితో కలిసివుంటున్నారు. అయితే జోగతి నృత్యానికి పెద్ద ఆదరణ ఉండదని, అమవాస్యకో, పున్నానికో పని దొరుకుతుందని, మిగిలిన రోజుల్లో పొట్ట కూటి కోసం కూడా కష్టమేనని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద, దుకాణాలు వద్ద చేయి చాచాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వివక్ష చూపకుండా మిగిలినవారితో సమానంగా తమకు కూడా విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించాలని రామక్క డిమాండ్ చేశారు.

215 స్థానాల్లో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు పోటీ చేస్తున్న స్థానాలు మినహా 215 నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు ప్రకటించింది. అలాగే బాగేపల్లిలో సిపిఎం తరుపున పోటీ చేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్‌కు మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా సిపిఐ కర్ణాటక రాష్ట్ర కార్యదర్శి సతి సుందరేశ్ మాట్లాడుతూ ఏడు స్థానాల్లో సిపిఐ పోటీ చేస్తోందన్నారు. మరో 215 స్థానాల్లో కాంగ్రెస్‌కు, మేలుకోటేలో దర్శన్ పుట్టయ్యకు, బాగేపల్లిలో సిపిఎం అభ్యర్థి అనిల్‌కు మద్దతు తెలియజేస్తున్నామని ఆయన చెప్పారు. కర్ణాటకలో బిజెపిని ఓడించి తీరాలనే లక్ష్యంతో ప్రజలంతా తమ ఓటు హక్కు వినియోగించాలని కోరారు. బిజెపి పాలనలో రాష్ట్రం అథోగతి పాలైందన్నారు. మతోన్మాద ఘటనలు, అవినీతి రాజ్యమేలుతున్నాయని విమర్శించారు.



స్టాక్‌హోమ్‌లో నాటోకు వ్యతిరేకంగా వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న స్వీడన్లు

నాటోకు వ్యతిరేకంగా స్వీడన్‌లో భారీ నిరసనలు

స్టాక్‌హోమ్ : నాటో కూటమికి వ్యతిరేకంగా స్వీడన్‌లో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. నాటో సైనిక విన్యాసాలకు స్వీడన్ అతిథ్యం ఇవ్వడాన్ని, నాటోలో సభ్యత్వం కావాలని స్వీడన్ ప్రభుత్వం కోరడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా 17 నగరాల్లో శనివారం పెద్దయెత్తున నిరసనలు చోటుచేసుకున్నాయి. . స్వీడిష్ పీస్ అండ్ అర్బిట్రానేషన్ సొసైటీ, నో నాటో, నో టూ న్యూక్లియర్ వెపన్స్ వంటి సంస్థలు, నెట్‌వర్క్స్, రాజకీయ పార్టీలు సంయుక్తంగా ఈ నిరసనలకు పిలుపునిచ్చాయి.. స్టాక్‌హోమ్‌లో జరిగిన నిరసనలో వందలాది మంది పాల్గొన్నారు. ప్రస్తుతం దేశం అతిధ్యం ఇస్తున్న 26 వేల మంది నాటో సభ్య దేశాల సైనికులతో జరుగుతున్న విన్యాసాలను నిరసనకారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆరోరా 23 పేరుతో ఈ విన్యాసాలు జరుగుతున్నాయి. 'స్టాప్ ఆరోరా 23', 'నో టూ నాటో' వంటి నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. 'నాటో అనేది అమెరికా యుద్ధ కార్యక్రమం తప్ప మరొకటి కాదు' అని ఒక నిరసకారుడు తెలిపారు. 'నాటోను ఒక రక్షణ కూటమిగా వారు పేర్కొంటున్నా.. అది అమెరికా ఆధిపత్యం కోసం పని చేసే సంస్థ మాత్రమే' అని మరొక నిరసకారుడు విమర్శించారు. ' డాలర్ ఆధిపత్యం కోసం నాటో సాగించే యుద్ధం మా పిల్లలను చంపేస్తుంది' అని బ్యానర్లు ప్రదర్శించారు. స్వీడన్ తటస్థంగా ఉంటే మంచిదని కమ్యూనిస్టు పార్టీ సభ్యులు క్రిస్టర్ హోల్మ్ చెప్పారు.

నాటోలో చేరడానికి అనుకూలంగా స్వీడన్ పార్లమెంట్ మార్చి 22న ఓటు వేసింది. అయితే దీనికి అనుకూలంగా నాటో సభ్యులు హంగేరి, టర్కీ ఇప్పటి వరకూ స్పందించ లేదు. మరోవైపు నాటోలో స్వీడన్ చేరడాన్ని దేశంలో అనేకమంది వ్యతిరేకిస్తున్నారు.

మహారాష్ట్రలో మళ్లీ కిసాన్ మార్చ్

- 26 నుంచి 28 వరకు రైతుల కవాతు
- అహ్మద్ నగర్ నుంచి లోని వరకు యాత్ర
- ఎఐకెఎస్ వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలో అన్నాదాతలు మళ్లీ ఉద్యమబాట పట్టనున్నారు. ఈ నెల 26 నుంచి 28 వరకు మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. ఈ మేరకు అఖిల భారత కిసానసభ (ఎఐకెఎస్) నాయకులు అశోక్ ధావలే, జెపి గవిత్ తదితరులు ఆదివారం నాడు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్రలో అవినీతి, అనైతిక రాజకీయాల ఫలితంగా రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, శ్రామిక ప్రజలందరికీ సమస్యలు తీవ్రమయ్యాయన్నారు. దీనికి తోడు ప్రకృతి విపత్తులు అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీశాయన్నారు. అధికార బిజెపికి చెందిన చాలా మంది నాయకులు రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి, వివిధ రకాల లంచాలు ఇవ్వడం, జైలు భయం చూపడంలో బిజీగా ఉన్నందున ప్రజల ప్రాథమిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. దీంతో అన్నదాతలు మళ్లీ వీధుల్లోకి రావాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 26 నుంచి 28 వరకు అహ్మద్‌నగర్ జిల్లాలోని అకోలే నుండి లోని వరకు వేలాది మంది రైతులతో రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాదయాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఈ యాత్రకు సిఐటియు, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐతో పాటు ఇతర భావసారూప్య ప్రజా సంఘాలు మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. మహారాష్ట్ర రెవెన్యూ, పాడిపరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ కార్యాలయం వరకు మార్చ్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అన్నదాతల సమస్యలను, డిమాండ్లను పరిష్కరించనిపక్షంలో లోని లో నిరవధిక మహాపడావ్ నిర్వహిస్తామని తెలిపారు.

అకాల వర్షాలతో అతలాకుతలం

మహారాష్ట్రలో గత రెండేళ్లుగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో అకాల వర్షాలు రైతన్న వెన్ను విరిచాయి. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటి వరకు చిల్లగవ్వ కూడా సాయం చేయడం లేదు. అటవీ భూమి, దేవాలయాల భూమి, ఈనాం భూమి, వక్ఫ్ భూమి, పచ్చిక బయళ్ళను రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాల కోసం ఇస్తామని పదే పదే హామీలు ఇచ్చారు. ఆ హామీలను కూడా ఇప్పటి ప్రభుత్వం విస్మరించింది. హైవేలు, కారిడార్లు, ఓడరేవులు, విమానాశ్రయాల కోసం భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం నామమాత్రం పరిహారంతో రైతులను ఖాళీ చేయించింది. కోవిడ్ నేపథ్యంలో పాడి పరిశ్రమ కూడా చతికిలపడింది. లీటరు పాలకు కేవలం రూ.17 మాత్రమే అందుతున్నాయి. దీనికి తోడు కేంద్రం పాల ఉత్పత్తుల దిగుమతులకు పచ్చజెండా ఊపేందుకు ప్రయత్నిస్తోందని, దీనివల్ల పాల రైతులు మరింత కుదేలు అవ్వడం ఖాయమని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి, సోయాబీన్, తురుము, మినుము తదితర పంటల ధరలు పూర్తిగా పతనమైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు.

రైతన్నల ప్రధాన డిమాండ్లు..

- రైతులు, వ్యవసాయ కార్మికుల భూములను అభివృద్ధి పథకాలకు సేకరిస్తే న్యాయమైన పరిహారం ఇవ్వాలి.
- పాలు, పత్తి, సోయాబీన్, టర్న్, గ్రాము, ఇతర ఉత్పత్తులకు లాభదాయకమైన ధర కల్పించాలి. పాలు, పాల ఉత్పత్తుల దిగుమతులు రద్దు చేయాలి.
- ప్రకృతి విపత్తుల పంటలు నష్టపోయిన రైతన్నలకు పరిహారం చెల్లించాలి.
- రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరుపేద ప్రజలకు పెన్షన్ పెంచాలి.
- భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులకు వైద్యం, గృహ సౌకర్యాలు కల్పించాలి.
- అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ఇతర అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల హోదా కల్పించాలి.



మీ కోసం

వెల్లుల్లి పైపొట్టు సులభంగా రావాలంటే పాన్‌లో ఓ పది సెకన్లు వాటిని వేడి చేయాలి.

జీవనసౌరభం

చేసే పనిలో అడ్డంకులు వస్తే ఆపాల్సింది పని కాదు.. ప్రయత్నించే విధానం.

మామిడి పండు



పండు పండు
భలే పండు
మామిడిపండు

కాయగా ఉన్నప్పుడు
పుల్లగా ఉండు
సి విటమిన్
మెండుగా ఉండు

పండుగా మారినప్పుడు
తీయగా ఉండు
బి విటమిన్
దండిగా ఉండు

పసిడి రంగు
ఉండు పండు
బంగినపల్లి
కోత పండు

ఎరుపు రంగు
ఉండు పండు
సువర్ణ రేఖ

రసం పండు

పలు రంగుల్లో
మెరిసే పండు
పలు పేర్లతో
పిలిచే పండు
మామిడి పండు

పండు పండు
భలే పండు
మామిడి పండు

– అమ్మిన వెంకట అమ్మిరాజు
94407 08656






మందరపు లక్ష్మీ సహస్ర,
2వ తరగతి,
సిద్దార్థ పబ్లిక్ స్కూలు,
విజయవాడ. ఎన్టీఆర్ జిల్లా.

దారి చూపండి

చిన్నారులూ, చంటి ఇంటికి వెళ్లే దారి మరిచిపోయాడు. మరి దారి చూపి సాయం చేయరూ!



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నా కూతురే.. పునర్జన్మ నిచ్చింది!

'కంటే కూతుర్నే కనాలి' అని ఓ గేయ రచయిత అన్న మాట నిజం చేసింది హర్షిత. తన తండ్రి వెంకటరామయ్యకు తన లివర్‌లో సగభాగం దానం చేసి ... బతికించుకుంది. కాలేయ వ్యాధికి గురైన తండ్రి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు ... ధైర్యంగా అవయవ దానానికి ముందుకొచ్చింది. పెళ్లి అయ్యి అత్తారింటికి వెళ్లిన హర్షిత మరో ఆలోచనకు తావు లేకుండా తండ్రి కోసం అవయవదానం చేసింది. తన కూతురే తన ప్రాణాలు నిలబెట్టి, మరో అమ్మ అయిందని తెలిసి వెంకటరామయ్య భావోద్వేగానికి లోనయ్యారు. ఆ హృదయానందం ఆయన మాటల్లోనే ...



'మాది ప్రకాశం జిల్లా, గిద్దలూరు. ఉద్యోగం రీత్యా దర్శి మండలం తాళ్లూరులో స్థిరపడ్డాం. దర్శి పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నా. నా భార్య బిందు మాధవి గృహిణి. ఇద్దరు పిల్లలు. హర్షిత, గాయత్రి. నాకు ఆడపిల్లలంటే చాలా ఇష్టం. అందుకే ఇద్దరూ ఆడపిల్లలే పుట్టారనిపిస్తూ ఉంటుంది. హర్షిత మొదట పుట్టినప్పుడు చాలా సంబరపడ్డాం. ప్రేమగా చూసుకున్నాం. ఆఫీసు నుంచి రాగానే చిన్న పిల్లాడిలా తనతో ఆడుకునే వాడిని. కొన్నాళ్లకు చిన్న అమ్మాయి గాయత్రి పుట్టింది. 'ఇద్దరూ ఆడపిల్లలే..' అని చుట్టూ జనం అనేవారు. అయినా ఎప్పుడూ బాధపడలేదు. వాళ్లే కూతుళ్లు అయినా... కొడుకులైనా అనుకున్నాం. అలాగే పెంచాం.

15 ఏళ్ల క్రితం నాకు జాండిస్ వచ్చింది. మందులు వాడాను. తగ్గిపోయింది. తర్వాత దర్శికి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. మా బంధువులో ఒకరు లివర్ వ్యాధితో బాధపడుతూ ప్రాణాలు కోల్పోయాడు. దాంతో మా అందరికీ భయం వేసింది. ఎందుకైనా మంచిదని మా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఒక హాస్పటల్లో నాకు హెల్త్‌చెకప్ చేయించారు. లివర్ సమస్య ఉన్నట్లు రిపోర్టు వచ్చింది. అప్పటి నుంచి ప్రతి నెలా వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నా. దాదాపు పదేళ్లు అవుతోంది. ఎలాంటి సమస్యా లేదు. గత ఏడాది నవంబర్‌లో ఒక రోజు కడుపునొప్పితో వాంతులు, విరేచనాలూ మొదలయ్యాయి. అందరూ భయపడ్డారు. అంబులెన్స్‌లో హైదరాబాద్ వెళ్లాం. ఐసియులో ఉంచారు. నా పరిస్థితి క్రిటికల్‌గానే ఉంది. వెంటనే లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని వైద్యులు సూచించారు.

'ఎవరికైనా లివర్, కిడ్నీలు వంటి అవయవాలు పాడై, అవయవ మార్పిడి అవసరమైతే ముందుగా రక్త సంబంధీకులు, కుటుంబ సభ్యులు మాత్రమే దానం చేయాల్సి ఉంటుంది. అది కూడా మేజర్లు.. అంటే 18 సంవత్సరాలు పైబడిన వాళ్లు మాత్రమే దానం చేయాలి. బయటవాళ్లు అయితే ప్రభుత్వ అధికారుల అనుమతి తీసుకోవాలి. కాని మా దగ్గర అంత సమయం లేదు. నాకు వెంటనే ఆపరేషన్ చేయాలన్నారు. లివర్ ఇచ్చిన డోనర్స్‌కు ఏ ప్రమాదం జరగదని, భవిష్యత్తులో కూడా ఎటువంటి ఇబ్బందీ ఉండదని డాక్టర్లు కౌన్సిలింగ్ చేశారు. దాంతో నా భార్య ముందుకు వచ్చింది. ఆమెకు అన్ని పరీక్షలూ చేశారు. రక్త సంబంధం లేకపోయినా.. నాకు అవయవం ఇచ్చేందుకు సెట్ అయ్యింది. దాంతో వైద్యులు ఆపరేషన్‌కు సిద్ధమయ్యారు. కాని చివరి గంటలో ఆమెకు బిపి (రక్తపోటు) ఎక్కువైంది. రెండు రోజులైనా కంట్రోల్ అవ్వలేదు. దాంతో నా పరిస్థితి గంట గంటకు ఇబ్బందికరంగా మారింది. అప్పుడు నా కూతురు హర్షిత 'నాన్నకు నా లివర్ ఇస్తా.. ఆపరేషన్ ఆలస్యం చేయొద్దు...' అంటూ వైద్యులను కోరింది. దాంతో వైద్యులు ఆమెకు అన్ని పరీక్షలూ చేసి వారంలో అవయవ మార్పిడి చేశారు. వారం రోజులు ఐసియులో ఉంచారు. తనకు నాలుగేళ్ల చిన్న పాప ఉంది. అయినా ధైర్యంగా ఆపరేషన్‌కు ముందుకు వచ్చింది. కుటుంబ సభ్యులంతా సహకరించారు. 14 మంది రక్తదానం చేశారు. ఖర్చు కూడా బాగా అయ్యింది. వైఎస్‌ఆర్ హెల్త్ కేర్ ట్రస్ట్ నుంచి కొంత సహాయం అందింది. కూతుళ్లు, అల్లుళ్లు, బంధువులు జాగ్రత్తగా చూసుకోవడంతో రెండు నెలలకు ఇంటికి వచ్చాం. ప్రతి వారం హాస్పటల్‌కి వెళ్లి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో చెకప్ చేయించారు. దాంతో త్వరగా కోలుకున్నా. అందుకే లివర్ సమస్యతో బాధపడుతున్న వారికి నా అనుభవమే ఓ నిదర్శనం. ఇప్పుడు ఉద్యోగానికి వెళుతున్నా. చాలా సంతోషంగా ఉంది. నా పెద్ద కూతురే నా పునర్జన్మనిచ్చింది.'



ఈ మాటలు చెబుతున్నప్పుడు వెంకటరామయ్య కళ్లు నీళ్లతో నిండిపోయాయి. కూతురి పట్ల ప్రేమ, కృతజ్ఞత ఆయన మాటల్లో ధ్వనించాయి. మగపిల్లలైతేనే తల్లిదండ్రులను చూస్తారు. ఆడపిల్ల అయితే అత్తారింటికి వెళుతుంది. తల్లిదండ్రులను చూడదు అనే మాటలకు ఇప్పుడు అర్థం లేదు. హర్షిత చూసిన చొరవా, ప్రేమా ఇప్పుడు ఆ ఇంటిల్లిపాదికీ ఆనందకారకం. కూతురి ప్రేమకు నిలువెత్తు రూపం కూడా!

– పద్మావతి



నాన్న బాధ చూడలేక పోయా ...

మా నాన్న మా అక్కచెల్లెళ్లను చాలా బాగా చూసుకున్నారు. మగ పిల్లలు పుట్టలేదే అన్న చింత ఆయనకు ఎప్పుడూ లేదు. మా నిర్ణయాలను గౌరవించేవారు. అభిప్రాయాలు తెలుసుకుని మెసులుకునేవాడు. మా ఇంటికి బంధువుల్లో ఆడపిల్లలు వస్తే చాలా మార్యాదగా చేసి పంపిస్తారు. మమ్మల్ని చదివించి, పెళ్లిళ్లు చేశారు. నేను హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు స్కూల్లో టీచర్‌గా వెళుతున్నా. నాన్న లివర్ వ్యాధితో బాధపడుతున్నప్పుడు చూడలేకపోయా. ఆసుపత్రిలో బెడ్ మీద అలా యూరిన్ పోతూ ఉండేది. ఏమౌతుందో ఆయనకు తెలిసేది కాదు. ఆయన పరిస్థితి చూసి నిద్రపట్టలేదు. ఎలాగైనా నాన్న బతకాలి అన్నదే నా గట్టి ఆలోచన. అప్పుడు నా భర్తని కూడా అడగలేదు. అవయవ దానం చేస్తానని నేనే డాక్టర్లకు చెప్పా. ఆపరేషన్ అయిపోయాక.. 'నాన్న పరిస్థితి మెరుగుపడుతోంది' అని విని... నా మనసు కుదటపడింది. నా భర్త, అత్త గారి కుటుంబీకులు నా నిర్ణయాన్ని గౌరవించారు. మద్దతుగా నిలిచి నా ఆరోగ్యం కోలుకునే వరకూ చూసుకున్నారు. నాన్న మా ఇంట్లోనే మూడు నెలలు ఉన్నారు. అమ్మ అయితే నాకూ, నాన్నకు దగ్గరుండి సేవలు చేస్తూనే ఉంది. నా కూతురు నా దగ్గరకు వస్తే ఎక్కడ నన్ను ఇబ్బంది పెడుతుందోనని అమ్మే ఎత్తుకుని తిరిగింది. ఇప్పుడు కోలుకుని ఉద్యోగానికి వెళుతున్నా. చిన్నప్పుడు ఎవరి తల్లిదండ్రులైనా మనల్ని చాలా ఓర్పుగా, కంటికి రెప్పలా కాపాడుకుంటారు. వారు పెద్దయ్యాక వారినీ మనం అలాగే చూసుకోవాలి.

– హర్షిత, వెంకటరామయ్య పెద్ద కూతురు

శరత్‌బాబు ఆరోగ్యం విషమం



సీనియర్ సినీనటుడు శరత్‌బాబు అస్వస్థతకు లోనైన విషయం తెలిసిందే. ఆయనను ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీలో చేర్పించారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యం విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ కావడంతో ఆ ప్రభావం కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయంతోపాటు ఇతర అవయవాలపై పడ్డట్టు వెల్లడించారు. ప్రస్తుతం శరత్‌బాబుకు ఐసీయూలో వెంటిలేటర్‌పైనే చికిత్సనందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు. అనారోగ్యంతో కొన్ని రోజులుగా బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరత్ బాబును మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఆసుపత్రిలో జాయిన్ చేశారు. శరత్‌బాబు త్వరగా కోలుకోవాలని సినీ ప్రముఖులు, అభిమానులు కోరుకుంటున్నారు.

'అయాలాన్' అప్డేట్




కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ నటిస్తున్న చిత్రం 'అయాలాన్'. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమా గురించి సోమవారం అప్డేట్ ఇవ్వనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందించనున్నారు. 4,500కి పైగా షాట్‌లను కలిగి ఉన్న ఈ చిత్రం మొదటి పూర్తి నిడివి లైవ్ యాక్షన్‌గా ఉండబోతుందని మేకర్స్ ప్రకటించారు. ఏలియన్ క్యారెక్టర్ కీలక పాత్ర పోషిస్తుంది. అందాల సుందరి రకుల్ ప్రీత్ సింగ్ కథానాయికగా నటిస్తోంది. కెజెఆర్ స్టూడియోస్‌పై కోటపాడి జె రాజేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



'విశాల్ 34' చిత్రం

హీరో విశాల్ హరి దర్శకత్వంలో కొత్త సినిమాకు ఒకే చేశాడు. విశాల్ 34 పేరుతో వస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చుట్టూ గన్స్, కత్తులు కనిపిస్తుండగా.. మధ్యలో స్టెతస్కోప్ చూడొచ్చు. విశాల్ ఇందులో డాక్టర్‌గా కనిపించబోతున్నట్టు తాజా లుక్‌తో అర్థమవుతోంది. మాస్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమా ఉండబోతుంది. హరి దర్శకత్వంలో విశాల్ నటిస్తోన్న మూడో సినిమా. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్–జీ స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ షురూ కానుంది.

హ్యాపీ బర్త్ డే కెప్టెన్



నాగ్ అశ్విన్ ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాతో ఇండస్ట్రీలోకి దర్శకుడిగా ఎంట్రీ ఇచ్చాడు. రెండో సినిమా మహానటితో ఒక్కసారిగా ప్రతి ఒక్కరినీ తన వైపు చూసేలా చేశాడు. ఈసారి అంతకుమించి అన్నట్లు సౌత్ ఇండియా, నార్త్ ఇండియా, పాన్ ఇండియా కాదు, పాన్ వరల్డ్ బాక్సాఫీస్‌ని టార్గెట్ చేస్తూ 'ప్రాజెక్ట్ కె' సినిమా చేస్తున్నాడు. దీనిలో హీరో ప్రభాస్ నటిస్తున్నాడు అనడంతో అభిమానుల్లో ఉత్సాహం ఎక్కువయ్యింది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఆడియన్స్ ముందుకి రానుంది. ఆదివారం నాగ్ అశ్విన్ బర్త్ డే కావడంతో వైజయంతి మూవీస్ బ్యానర్ నుంచి విషెస్ చెప్తూ మేకర్స్ ఫొటో ఒకటి ట్వీట్ చేశారు.




ఆ వార్తల్లో నిజం లేదు

ఊర్వశి రౌతేలా

తన గురించి వస్తోన్న వార్తలు నిజం కాదని బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా స్పష్టం చేశారు. ఓ వ్యక్తి తన పేరుతో పెడుతోన్న సోషల్‌మీడియా పోస్టులను నమ్మవద్దని అన్నారు. తానొక సెన్సార్ బోర్డు సభ్యుడినని చెబుతూ ఉమైర్ సంధు అనే వ్యక్తి కొన్నిరోజులుగా ట్విటర్లో పోస్టులు పెడుతున్నాడని అన్నారు. హీరో అఖిల్ 'ఏజెంట్' సినిమా షూట్‌లో తనని వేధించాడని అతడు పెట్టిన ట్వీట్ అబద్ధం అని ఊర్వశి ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇలాంటి ట్వీట్స్ చేస్తోన్న ఈ వ్యక్తిపై నా లీగల్ టీమ్ ఇప్పటికే పరువునష్టం దావా వేసింది.' అని స్పష్టం చేశారు.

టైమ్‌లెస్ లవ్ ...


హీరో నాగచైతన్య నటిస్తోన్న తాజా చిత్రం కస్టడీ. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వెంకట్ ప్రభు డైరెక్ట్ చేస్తున్నాడు. మే 12న విడుదల అవుతుంది. ప్రమోషన్లో భాగంగా ఈ చిత్రం నుంచి 'టైమ్‌లెస్ లవ్' లిరికల్ వీడియో సాంగ్‌ను లాంఛ్ చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను యువన్ శంకర్ రాజా, కపిల్ పాడారు. చిత్రంలో నాగచైతన్యకు జోడీగా కృతిశెట్టి నటిస్తోంది. కస్టడీలో నాగచైతన్య పోలీసాఫీసర్ శివగా కనిపించబోతున్నాడు. యాక్టర్ అరవింద్ స్వామి విలన్‌గా నటిస్తున్నారు. శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇళయరాజా, యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



ఉత్కంఠపోరులో రాజస్థాన్‌పై

బెంగళూరు ఘన విజయం

బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరోసారి అదరగొట్టింది. ఐపిఎల్ లీగ్ మ్యాచ్‌ల్లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. 190 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులకు పరిమితమైంది. యశస్వి జైస్వాల్ (47, 37 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్ (52, 34 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ధ్రువ్ జురెల్ (33, 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్) రాణించినా మిగతా బ్యాటర్లు పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. ఆర్సీబీ బౌలర్లలో హర్షల్ పటేల్ మూడు, సిరాజ్, డేవిడ్ విల్లీ ఒక్కో వికెట్ పడగొట్టారు.





మ్యాక్స్‌వెల్ (77, 44 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), ప్లెసిస్ (62, 39 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో తొలుత బెంగళూరు భారీ స్కోరు సాధించింది. ఒకానొక దశలో ఆర్సీబీ సులువుగా 220 స్కోరు సాధించేలా కనిపించింది. కానీ, మ్యాక్స్‌వెల్, ప్లెసిస్ వరుస ఓవర్లలో ఔట్ కావడంతో బెంగళూరు ఇన్నింగ్స్ గాడితప్పింది. చివరి ఏడు ఓవర్లలో ఆర్సీబీ.. 7 వికెట్లు కోల్పోయి 54 పరుగులే చేసింది. రాజస్థాన్ బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ రెండేసి వికెట్లు పడగొట్టగా.. అశ్విన్, చాహల్ ఒక్కో వికెట్ తీశారు.

సచిన్ @50



ముంబయి : భారత క్రికెట్ దిగ్గజం, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను సొంతం చేసుకున్న సచిన్ టెండూల్కర్ ఈ నెల 24తో 50వ పడిలోకి ప్రవేశిస్తున్నాడు. క్రికెట్‌లో ఎన్నో మైలురాళ్లను అధిగమించి తన పేరుపై లెక్కలేనని రికార్డులు రాసుకున్న సచిన్ బర్త్ పుట్టిన రోజు అభిమానులకు చాలా ముఖ్యమైన రోజు. సచిన్ పుట్టిన రోజు సందర్భంగా అతని గురించి అనేక ఆస్తకర విషయాల్లో కొన్ని ... ఫిబ్రవరి 1988లో సచిన్ టెండూల్కర్–వినోద్ కాంబ్లీ కలిసి 664 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పోటీ క్రికెట్‌లో ఇదే అత్యధిక భాగస్వామ్యం. ఆ మ్యాచ్‌లో సచిన్ 326 పరుగులతో అజేయంగా నిలిచాడు. నవంబరు 1989లో 16 ఏళ్ల వయసులో సచిన్ కరాచీలో పాకిస్థాన్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లో సచిన్ అడుగుపెట్టాడు. అయితే తరువాత ఏడాది అంటే ఆగస్టు 14, 1990లో ఓల్డ్ మాంచెస్టర్‌లో జరిగిన టెస్టులో సచిన్ తొలి సెంచరీ నమోదు చేశాడు. 1996 వన్డే ప్రపంచకప్‌లో 523 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 24 ఫిబ్రవరి 2010లో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో అజేయంగా 200 పరుగులు చేశాడు. దీంతో వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు.

చెన్నై పరుగుల సునామీ

కోల్‌కతాపై 49 పరుగులతో గెలుపు

కోల్‌కతా: ఆదివారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. దీంతో చెన్నై జట్టు 49 పరుగులతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ లక్ష్య చేధనలో బరిలోకి దిగిన కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 186 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులో జాసన్ రాయ్ (61 పరుగులు), రింకూ సింగ్ (53) మాత్రమే అర్థ సెంచరీలతో రాణించారు. మిగిలిన బ్యాటర్లు నిరాశ పరిచారు. వీరిలో ఆరుగురు కనీసం రెండెంకెల స్కోరు కూడా చేయలేదు. దీంతో కోల్‌కతాకు పరాభవం తప్పలేదు. ఈ మాచ్‌లో ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్ దిగిన చెన్నై జట్టులో రుతురాజ్ గైక్వాడ్ (20 బంతుల్లో 35 పరుగులు)తో మొదలైన విధ్వంసం చివరి వరకు కొనసాగింది. కాన్వే, రహానే, దూబే, జడేజా క్రీజులోకి వచ్చినవారు వచ్చినట్టే చెలరేగిపోయారు. బ్యాట్‌తో శివాలెత్తిపోయారు.



పరుగుల వర్షం కురిపించారు. ఈ మ్యాచ్‌లో మొత్తం ముగ్గురు అర్థ సెంచరీలు చేశారు. కాన్వే 56 (40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లు), అజింక్య రహానే 71 (29 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు), శివం దూబె 50 (21 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లు) పరుగులు చేశారు. రవీంద్ర జడేజా 8 బంతులు ఆడి రెండు సిక్సర్లతో 18 పరుగులు చేశారు. ధోని రెండు పరుగులతో అజేయంగా నిలిచారు. కోల్‌కతా బౌలర్లలో కుల్వంత్ ఖేజ్రోలియా 2 వికెట్లు సాధించారు. రహానేకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68